VELTHURU TELUGU DAILY


# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 14.09.2026
సంపుటి : 09 సంచిక : 94, పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com




## విలువలు బతికితేనే బంధాలు బలపడతాయి: గుత్తా సుఖేందర్ రెడ్డి



- ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం
- వ్యవసాయం, రైతుకు విలువ ఇవ్వడంలో పొన్నం సత్తయ్య స్ఫూర్తిదాయకం
- కొత్త తరానికి కుటుంబ విలువలు అందించాలి: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 13:**

ఆస్తులు తరతరాలకు అందుతాయని, కానీ కుటుంబ విలువలే తరాలను ఒక్కతాటిపై నిలుపుతాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కుటుంబ బంధాలు బలహీనపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారంతో ఐక్యంగా కొనసాగుతున్న పొన్నం కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు వక్తలు కొనియాడారు.వ్యవసాయం, రైతు సంక్షేమం, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు జీవితాంతం ప్రాధాన్యత ఇచ్చిన పొన్నం సత్తయ్య గౌడ్ ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారని వారు ప్రశంసించారు.పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు–2026' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, సాహిత్యం, జానపద కళారంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు.



▶ మిగతా 2లో

## సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, అమరవీరుల త్యాగఫలమే హైదరాబాద్ విముక్తి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు
- ఆపరేషన్ పోలో అమరవీరులకు ఘన నివాళి, మాజీ సైనికులకు సన్మానం
- సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి - పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చాలని డిమాండ్



2

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

భారతదేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ఆపరేషన్ పోలో అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆత్మబలిదానాల వల్లే నేడు మనం భారత యూనియన్‌లో అంతర్భాగమై గర్వంగా జీవిస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఆపరేషన్ పోలో ప్రారంభ దినోత్సవం (సెప్టెంబర్ 13) సందర్భంగా ఆదివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న చారిత్రక యుద్ధ ట్యాంక్ వద్ద తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించి, మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు.

## ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎంరేవంత్ రెడ్డి

- ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- కలిసికట్టుగా ఉంటేనే బలం.. రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోవాలి
- ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి సహకారం
- పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు భవన్ అండగా నిలవాలి: సీఎం

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 13:**



11

ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆర్యవైశ్య సమాజం పట్ల తనకున్న అనుబంధాన్ని, సమాజ అభివృద్ధిలో పాత్రను సీఎం ప్రస్తావించారు.



## సెప్టెంబర్ 19న కోదాడ లో మేఘాజాబ్ మేళా

- తరలిరానున్న 300 కంపెనీలు
- మూడు నుంచి నాలుగు వేల మందికి ఉద్యోగ వకాశాలు
- అర్హులైన ప్రతీ యువతీ యువకుడూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- హాజరు కానున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

**వెలుతురు హైదరాబాద్ / కోదాడ, సెప్టెంబర్ 13:**

## అసెంబ్లీలో నడిచింది సభ కాదు, కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల నాటకం

- రూ.33 వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదు.
- లక్షల కోట్ల భూదోపిడీ గుట్టు విప్పిన బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

గత ఐదు రోజులుగా శాసనసభ సమావేశాలు సాగుతున్న తీరును రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా సమస్యలను నిలదీస్తున్న బీజేపీ గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



2



11

## బాల్యమిత్రుడికి ప్రధాని మోదీ అభయం.. కదిలిన యంత్రాంగం

**ఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 13:**

## నేటి నుండి మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు షురూ

- విఘ్నేశుని వెలుగుల్లో కరీంనగరం భక్తి పరవశం
- శ్రీ మహాశక్తి ఆలయంలో 16 ఏళ్లుగా వైభవంగా కొనసాతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు
- తొమ్మిది రోజుల పాటు విశిష్టమైన సహస్ర మోదక గణపతి హోమం




11

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**

## హిందూ బంధువులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

- హిందువుల ఐక్యతా స్ఫూర్తికి, భక్తికి నిదర్శనం గణేశ్ ఉత్సవాలు
- హిందువులంతా సంఘటితంగా ఉంటూ ఆనందోత్సవాలతో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి
- వర్షాలు కురుస్తున్నందున గణేశ్ మండపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రతి ఇంట సుఖసంతోషాలు నింపాలి
- గణనాథుడి ఆశీస్సులతో తెలంగాణ మరింత సుభిక్షంగా ఉండాలి
- ప్రతి కుటుంబం ఆనందంగా... ప్రతి గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాలి
- ధర్మాన్ని కాపాడుదాం... సంప్రదాయాలను పరిరక్షిద్దాం
- హిందూ పండుగలను ఘనంగా నిర్వహించడం మనందరి బాధ్యత
- వినాయకుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోవాలి
- ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను జరుపుకోవాలి
- గణనాథుడి ఆశీస్సులతో తెలంగాణలో ధర్మ విజయం సాధించాలి



- ప్రజల కష్టాలు తొలగాలి... ప్రతి ఇంట సంతోషం వెల్లివిరియాలి
- ఐక్యంగా గణేశ్ ఉత్సవాలను జరుపుకుందాం...భక్తిపారవశ్యంతో వినాయకుడిని కొలుద్దాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**



# విలువలు బతికితేనే బంధాలు బలపడతాయి: గుత్తా సుఖేందర్ రెడ్డి



### వ్యవసాయమే గ్రామీణ జీవనానికి ఆధారం

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ సమాజంలో వ్యవసాయానికి, రైతుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వ్యవసాయానికి విలువనిస్తూ రైతు జీవితాన్ని గౌరవించిన వ్యక్తిగా పొన్నం సత్తయ్య నిలిచారని పేర్కొన్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉండేదని, కుటుంబంలో ఎవరికైనా కష్టం వస్తే మిగిలిన వారు అండగా నిలిచేవారని గుర్తుచేశారు. పెద్దలు తమ అనుభవాలను చిన్నవారికి పంచుకోవడం, చిన్నవారు తమ సమస్యలను పెద్దలతో పంచుకోవడం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనమన్నారు.ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతో కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని, దాని ప్రభావం సమాజంపైనా పడుతోందన్నారు. ఒంటరితనం, అసంతృప్తి, కుటుంబ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో మానవ సంబంధాలు, కుటుంబ విలువలను కొత్త తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### పొన్నం కుటుంబం విలువలకు ప్రతిరూపం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పొన్నం కుటుంబంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రేమ, ఆప్యాయతలతో అందరినీ కలుపుకుపోయే నాయకుడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలు, నాయకులను సోదరభావంతో కలుపుకుపోతున్నారని అన్నారు. పొన్నం సత్తయ్య చూపిన మార్గం, కుటుంబ విలువలు నేటికీ ఆ కుటుంబంలో కొనసాగుతున్నాయని, ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా, ప్రేమగా ఉండటం సంతోషకరమైన విషయమన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, పరస్పర సహకారం సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు.పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య, శిక్షణ, అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.

### 'జై తెలంగాణ' నినాదం నుంచి మంత్రి స్థాయికి

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. యువజన కాంగ్రెస్‌లో పోరాట స్ఫూర్తిని నింపుతూ ఎక్కడ ఉద్యమం జరిగినా ముందుండే వారని అన్నారు. పార్లమెంట్‌లోనూ బలంగా 'జై తెలంగాణ' నినాదాన్ని వినిపించారని పేర్కొన్నారు. ఆ పోరాట స్ఫూర్తి, ప్రజల పట్ల నిబద్ధతలో పొన్నం సత్తయ్య విలువల ప్రభావం కనిపిస్తోందన్నారు.

### రైతుకు దక్కిన గౌరవంగా పురస్కారాన్ని భావిస్తున్నా

వ్యవసాయ పురస్కార గ్రహీత, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి మాట్లాడుతూ తనకు లభించిన పురస్కారం వ్యక్తిగత గౌరవం కాదని, తెలంగాణ రైతులకు దక్కిన గౌరవమన్నారు. తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, చిన్ననాటి నుంచే వ్యవసాయంతో అనుబంధం ఉందన్నారు. రైతుల అప్పులు, ప్రకృతి వైపరీత్యాలు, కౌలు రైతులు, చిన్న రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించిన ఆయన, రైతులు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు.

### ఐదో ఏడాది నుంచి వ్యవసాయ రంగానికి పురస్కారం

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన తండ్రి పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరిస్తున్నామని తెలిపారు. గత ఏడాది వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు ఈ ఏడాది నుంచి వ్యవసాయ రంగాన్ని కూడా పురస్కారాల్లో చేర్చామని చెప్పారు.వ్యవసాయ రంగంలో రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎం. కోదండరెడ్డిని ఈ ఏడాది ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, జానపద కళారంగంలో గొట్టె కనకవ్వలను జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు.

### తల్లిదండ్రులు ఇచ్చేది ఆస్తి కాదు.. విలువలు

తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా తమకు విద్య, క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పించారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తమకు వ్యవసాయం విలువ, రైతు కష్టం తెలుసునన్నారు. తండ్రి పేరుతో ప్రతి ఏడాది కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు.

### తండ్రి కష్టం.. పిల్లల విజయాలుగా

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య తన జీవితాన్ని వ్యవసాయంతో పాటు పిల్లల భవిష్యత్తు కోసం అంకితం చేశారని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనులు చేస్తూనే పిల్లలను ఉన్నతంగా చదివించాలనే దూరదృష్టితో వ్యవహరించారని తెలిపారు. ఆయన ముగ్గురు కుమారులు వివిధ రంగాల్లో రాణించడం తండ్రి కష్టం, క్రమశిక్షణ, విలువలకు ప్రతిఫలమని పేర్కొన్నారు.



### ఆస్తులకంటే విలువలే గొప్ప వారసత్వం

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే గొప్ప వారసత్వం ఆస్తులు కాదని, మంచి ఆలోచనలు, ధైర్యం, విలువలు, కష్టాలను ఎదుర్కొనే శక్తి అని అన్నారు. కుటుంబం అందించే మానసిక బలం కష్టకాలంలో ఎంతో అవసరమని చెప్పారు.కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, పరస్పర సహకారం పెరిగితే సమాజంలోనూ శాంతి, సామరస్యం పెరుగుతాయని అన్నారు.

### ప్రతిభకు గుర్తింపు.. సమాజానికి స్ఫూర్తి

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులతో పాటు సంస్కారం, సంప్రదాయం, సానుభూతి, మానవత్వాన్ని అందించాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, కుటుంబ కలహాలు, హింస పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యత మరింత అవసరమని పేర్కొన్నారు.సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నం సత్తయ్య మానవ విలువలు, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను తరతరాలకు అందించాలనే ఉద్దేశంతో పురస్కారాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.సాహిత్య పురస్కార గ్రహీత వెలిచాల కొండల్‌రావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, అభిప్రాయాలు, ఆలోచనలకు ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భిన్నమైన భావాలు, సిద్ధాంతాలకు చెందిన వ్యక్తులు ఒకే వేదికపై కలవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పొన్నం కుటుంబ సభ్యులు, అభిమానులు, సాహిత్య, కళా, వ్యవసాయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



## అసెంబ్లీలో నడిచింది సభ కాదు, కాంగ్రెస్—బీఆర్ఎస్ పార్టీల నాటకం

సభలో బీజేపీ బాధ్యతాయుతంగా అవినీతి, భూ అక్రమాలపై గళమెత్తుతుంటే మంత్రులు మైకులు కట్ చేయిస్తూ అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మొదటి మూడు రోజుల పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై ఒకరినొకరు దూషించుకుంటూ ఉద్దేశపూర్వకంగా సభ సమయాన్ని వృథా చేశాయని, చివరి రోజున 22A నిషేధిత జాబితాపై చర్చ పేరుతో సంబంధిత మంత్రి ఏకంగా నాలుగు గంటల పాటు మతిభ్రమించినట్లు మాట్లాడారే తప్ప 50 లక్షల మంది రైతులు, పేద వర్గాలకు సంబంధించిన సమస్య పరిష్కారానికి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. 22A సెక్షన్లను కోర్టు నిర్ణయించిందని మంత్రి చెప్పడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని, చట్టాలు చేసేది చట్టసభలు, జీవోలు ఇచ్చేది ప్రభుత్వమే తప్ప కోర్టులు కావని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, 13 వేల లావాదేవీల ద్వారా దాదాపు 23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని మంత్రులే సభలో అంగీకరించిన వీడియో రికార్డులను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. ఇంత భారీ కుంభకోణం జరిగిందని తెలిసినా ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, భూములను ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని నిలదీశారు. రిజిస్ట్రేషన్ అనేది టైటిల్ డీడ్ కాదని, తప్పుడు రిజిస్ట్రేషన్లను రద్దు చేసే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉన్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. దోపిడీ జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఆడిట్ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచడం లేదని, గతంలో వేసిన సిట్ కాకుండా కొత్తగా వేసిన సెట్ కేవలం సెట్టింగ్‌లు చేసుకునేందుకేనా అని ప్రశ్నించారు. ఈ మొత్తం భూ బాగోతంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అనే పేరుతో హైదరాబాద్ పరిసరాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూములను కారుచౌకగా కాజేసేందుకు కొత్త దందా మొదలుపెట్టారని ఏలేటి ఆరోపించారు. పేద అసైనీల నుంచి ముందే బాండ్ పేపర్లు, నోటరీలు రాయించుకొని, తర్వాత వారికే ఫ్రీహోల్డ్ కల్పిస్తున్నట్లు చట్టాలు తెచ్చి లక్షల కోట్ల విలువైన ఆస్తులను తమ పేర్ల మీద మార్చుకునే పథకం రచిస్తున్నారని విమర్శించారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కు చెందిన 333 ఎకరాల విలువైన భూమి ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ, దాదాపు రూ.33 వేల కోట్ల విలువైన ఈ భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని, ప్రభుత్వ పెద్దలకు ఇందులో 30 శాతం వాటాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అక్రమాలు జరిగినట్లు తేలినా బాధ్యులైన అధికారులపై పీడీ యాక్ట్ పెట్టడం గానీ, సస్పెండ్ చేయడం గానీ ఎందుకు చేయలేదని నిలదీశారు.హైడ్రా పేరిట ప్రభుత్వం పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. మూసీ నదికి 100 మీటర్ల దూరంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల చిన్న ఇళ్లను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేస్తున్న ప్రభుత్వం, మూసీ నది మధ్యలోనే మూడు ఎకరాల స్థలాన్ని ఆక్రమించిన పెద్దల జోలికి ఎందుకు వెళ్లడం లేదని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన నోటీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధుల భూవ్యవహారాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు మౌనం వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. మరోవైపు సంబంధిత మంత్రికి ఉన్న వ్యాపార ప్రయోజనాలు, అక్రమ మైనింగ్ వ్యవహారాలపై నోటీసులు రావడం, ప్రభుత్వంలో ఉంటూనే రూ.1,400 కోట్ల కాంట్రాక్టులను రివైజ్డ్ ఎస్టిమేషన్ల పేరుతో రూ.4,000 కోట్లకు పెంచుకోవడం ముమ్మాటికీ కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్, క్విడ్–ప్రో–కో కాదా అని సూటిగా ప్రశ్నించారు.అధికారంలో ఉన్నామని విర్రవీగితే చూస్తూ ఊరుకోబోమని, తమ వద్ద 200లకు పైగా పక్కా ఆధారాలతో కూడిన కేసు స్టడీలు ఉన్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. . ఈ అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను, గౌరవ గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే రాజ్యాంగ పుస్తకం చేతబట్టి తిరిగే రాహుల్ గాంధీ నివాసం ముందే ఢిల్లీలో ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ నీతిని దేశవ్యాప్తంగా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

## సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, అమరవీరుల త్యాగఫలమే హైదరాబాద్ విముక్తి

ఈ సందర్భంగా శ్రీ ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ, ట్యాంక్‌బండ్‌పై కొలువై ఉన్న యుద్ధ ట్యాంక్ తెలంగాణ ప్రజలకు ఒక నిరంతర స్ఫూర్తి కేంద్రమని కొనియాడారు. "ఒకవేళ ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ నిర్ణయం, కే.ఎం. మున్షీ గారి చొరవ, ఆపరేషన్ పోలో సైనిక చర్య లేకపోయి ఉంటే నేడు మనం చూస్తున్న హైదరాబాద్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడానికే భయమేస్తుంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పోరాటంలో ఎంతోమంది సైనికులు ప్రాణాలర్పించి, సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించారని ఆయన గుర్తుచేశారు.సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ ప్రజలందరికీ అత్యంత పవిత్రమైన విమోచన దినోత్సవమని, ఈ రోజును ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా ఉద్యమిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, మజ్లిస్ (MIM) పార్టీకి భయపడి వెనకడుగు వేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గాంధీ భవన్‌లో పార్టీ కార్యక్రమంగా జరుపుకుంటోందే తప్ప, ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో నిర్వహించకుండా 'ప్రజాపాలన' పేరిట అసలు చరిత్రను మరుగున పరుస్తోందని విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం అమరవీరుల త్యాగాలను విస్మరించడం క్షమించరాని నేరమని ఆయన మండిపడ్డారు.భవిష్యత్ తరాలకు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్ర, వందేమాతరం విలువలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పాఠశాల పాఠ్య పుస్తకాల్లో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన పోరాట చరిత్రను సమగ్రంగా పొందుపరచాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సైనికుల త్యాగాలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## సెప్టెంబర్ 19 న కోదాడ లో మేఘాజాబ్ మేళా

**వెలుతురు హైదరాబాద్ / కోదాడ, సెప్టెంబర్ 13:**

కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా మూడు వేల నుంచి నాలుగు వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దాదాపు 300 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయని, వేలాది ఉద్యోగ ఖాళీల భర్తీకి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయని తెలిపారు. ఉద్యోగాల కోసం గ్రామీణ యువత నగరాలు, ఇతర రాష్ట్రాల చుట్టూ తిరిగే పరిస్థితిని మార్చి, కంపెనీలనే వారి వద్దకు తీసుకురావాలన్న సంకల్పంతో ఈ భారీ నియామక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.కోదాడలో ఆదివారం జాబ్ మేళా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని, తమ బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.దాదాపు 300 కంపెనీలు మొత్తం 27 వేల మంది ఉద్యోగుల అవసరంతో కోదాడకు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అందులో కనీసం 15 శాతం అవసరాన్ని తీర్చగలిగినా మూడు వేల నుంచి నాలుగు వేల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. వేలాది మంది యువతకు ఉపాధి కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపగలిగితే అది గొప్ప విజయమే కాకుండా తనకు ఎంతో సంతృప్తినిచ్చే సందర్భమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన యువతకు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులకు నేరుగా అనుసంధానం కల్పించడమే ఈ జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.చేతిలో పట్టా, కళ్లలో భవిష్యత్తుపై ఎన్నో కలలు ఉన్నప్పటికీ సరైన సమాచారం, పరిచయాలు, అవకాశాలు లేక అనేకమంది యువత ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి యువత ప్రతిభను కంపెనీల ముందు ప్రదర్శించేందుకు కోదాడ జాబ్ మేళా బలమైన వేదికగా నిలుస్తుందన్నారు. ఇది కేవలం ఒక నియామక కార్యక్రమం మాత్రమే కాదని, నిరుద్యోగ యువతకు భరోసా కల్పించే ఉపాధి ఉద్యమమని అభివర్ణించారు.2025 అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి అపూర్వ స్పందన లభించిందని మంత్రి గుర్తుచేశారు. ఆ జాబ్ మేళాకు 40 వేల మందికిపైగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోగా, సుమారు 20 వేల నుంచి 21 వేల మంది అభ్యర్థులు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో మూడు వేల నుంచి మూడున్నర వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని వివరించారు.హుజూర్‌నగర్ జాబ్ మేళా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కోదాడలో 40 వేల మంది అభ్యర్థులు హాజరైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రద్దీని నివారించేందుకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నియామక ప్రక్రియ కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు వేర్వేరు సమయాలను కేటాయించి, క్రమబద్ధంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని సూచించారు.జాబ్ మేళాలో పాల్గొనే ప్రతి కంపెనీకి ప్రత్యేక ఇంటర్వ్యూ గదులు ఏర్పాటు చేయాలని, ప్రవేశ ద్వారాల వద్ద అభ్యర్థులకు సహాయపడేందుకు సమాచార కేంద్రాలను అందుబాటులో ఉంచాలని



ఆదేశించారు. సమాచార ప్రకటన వ్యవస్థ, వాహనాల నిలుపుదల, భోజన సదుపాయాలు, తాగునీరు, అభ్యర్థులు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు వేర్వేరు విడతల్లో నియామక పత్రాలను అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను ఆహ్వానించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వారు జాబ్ మేళాకు హాజరై, ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందించే అవకాశం ఉందన్నారు.కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కమిటీ ప్రతి రెండు రోజులకు ఒకసారి సమావేశమై ఏర్పాట్ల పురోగతిని సమీక్షిస్తుందన్నారు. కంపెనీలు, నియామక ప్రక్రియల సమన్వయం, భోజనం, వాహనాల నిలుపుదల, ప్రచారం, సామాజిక మాధ్యమాలు, ఇతర సదుపాయాల కోసం వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సంబంధిత జిల్లాల కలెక్టర్లు వివిధ కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి జాబ్ మేళాలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. పరిశ్రమలు, కార్మిక శాఖలతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థ, పరిశ్రమల శాఖ, ప్రాంతీయ పారిశ్రామిక సంస్థలు జాబ్ మేళా నిర్వహణకు సహకారం అందిస్తున్నాయని పేర్కొన్నారు.విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు కోదాడ మెగా జాబ్ మేళాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎన్. పద్మావతీ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో వేలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రముఖ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు వారు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పుడు వందలాది కంపెనీలే ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు కోదాడకు వస్తున్నందున అర్హులైన యువత ఈ అవకాశాన్ని చేజార్చుకోవద్దని కోరారు.జాబ్ మేళా గురించి సమాచారం తెలియలేదన్న ఒక్క కారణంతో కూడా అర్హులైన యువతీ యువకులు వెనుకబడకూడదని పద్మావతీ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాలు, సామాజిక కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ ఈ సమాచారాన్ని చేరవేయాలని కోరారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న అర్హులైన యువతను గుర్తించి జాబ్ మేళాకు తీసుకురావడాన్ని సమష్టి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 19న జరిగే కోదాడ మెగా జాబ్ మేళా గ్రామీణ యువత తమ ప్రతిభను ప్రముఖ కంపెనీల ప్రతినిధుల ముందు ప్రదర్శించేందుకు, నేరుగా ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు అపూర్వ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతీ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన యువత ముందుగానే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని, బయోడేటా ఐదు ప్రతులతో జాబ్ మేళాకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. వాడవాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా



విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

# నకిరేకల్ చేనేత సొసైటీలో అక్రమాల పుట్ట

- నిజమైన నేతన్నల కడుపు కొట్టి... గద్దెనెక్కిన 'బోగస్' గ్యాంగ్!.
- సెప్టెంబరు 15న ఎన్నికలు.. 200 మంది అసలైన నేత కార్మికుల రోదన!
- మెడికల్ వ్యాపారికి 'లీగల్' షాక్.. ఆ ఒక్కటి తేల్చాలని అల్టిమేటం!


INDIA POST
Sender
CHANDRAVATHI ADVOCATE
AP HIGH COURT
HYDERABAD
TELANGANA-500034
Receiver
THE COMMISSIONER OF HANDL
CHENETHA BHAVAN
HYDERABAD
TELANGANA-500001

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**
మగ్గం నేసి, దారాలు వడికి, చెమటోడ్చి కడుపు నింపుకునే అమాయక చేనేత కార్మికుల నోటికాడ కూడును సొసైటీ పెద్దలు దారుణంగా దోచేస్తున్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ చేనేత సహకార సంఘం (నెం.390/TH) వేదికగా జరుగుతున్న అక్రమాల పర్వం తీవ్ర కలకలం రేపుతోంది. మగ్గానికి, నేత వృత్తికి ఏమాత్రం సంబంధం లేని వ్యాపారులు, పరాన్నజీవులు సొసైటీని హస్తగతం చేసుకుని, ఏకంగా 200 మంది అర్హులైన నిజమైన చేనేత కార్మికులను రోడ్డున పడేసిన దారుణ వైనం బట్టబయలైంది.సెప్టెంబరు 15న సొసైటీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల కావడంతో ఈ బండారం కాస్తా బజార్న పడింది. సొసైటీ పరిధిలోని పోషం నిర్మల సహా 8 మంది బాధితులు తమ న్యాయవాది ఏ. చంద్రవతి ద్వారా స్థానిక మెడికల్ వ్యాపారి చిలుకూరి లక్ష్మీనర్సయ్యకు గట్టి లీగల్ నోటీసు జారీ చేయడంతో ఈ బోగస్ దందా గుట్టు రట్టయింది. చేనేత సహకార చట్టం-1964 ప్రకారం.. సొసైటీలో సభ్యుడిగా ఉండాలంటే ప్రత్యక్షంగా మగ్గంపై పని చేయాలి, నేత వృత్తినే ప్రధాన జీవనాధారంగా కలిగి ఉండాలి. కానీ, నిత్యం మెడికల్ షాపు నడుపుకుంటూ లక్షలు గడించే వ్యాపారికి చేనేత సొసైటీలో సభ్యత్వమేంటని బాధితులు నిలదీస్తున్నారు. తరతరాలుగా చేనేతనే నమ్ముకున్న 200 మంది అసలైన కార్మికులను కుట్రపూరితంగా పక్కనబెట్టేసి, తమ సొంత బంధువులు, బినామీలతో సభ్యత్వాలు నింపేసి సొసైటీ అధికార పీఠాన్ని దక్కించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నూలు, ముడిసరుకు, పక్కా రిబేట్లు, సబ్సిడీల సొమ్మును అసలైన నేత కార్మికులకు దక్కకుండా ఈ బోగస్ ముఠా నొక్కేస్తోందని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. 2019లోనే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా, ఆ తర్వాత శాఖాపరమైన విచారణలు (Rc.No .55/2019-C) జరిగినా, అధికారులను కూడా బురిడీ కొట్టిస్తూ ఈ దగాకోరు వ్యవస్థ రాజ్యమేలుతోందని నోటీసులో స్పష్టం చేశారు.

### సెప్టెంబరు 5 నుంచే నామినేషన్ల పర్వం

ప్రారంభమవుతున్న తరుణంలో బాధితులు సమరశంఖం పూరించారు. 24 గంటల్లోగా తాను నేసే మగ్గం ఎక్కడుందో, బట్టలు నేసిన ఆధారాలు, నూలు పొందిన రికార్డులను బహిర్గతం చేయాలని నర్సయ్యకు అల్టిమేటం జారీ చేశారు. సొసైటీ రికార్డులను ట్యాంపరింగ్ చేసినా, అక్రమ సభ్యత్వాలతో ఎన్నికల్లో అడుగుపెట్టినా ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ, ట్రిబ్యునల్, హైకోర్టుల తలుపు తట్టి బోగస్ రాయుళ్ల ఆటకట్టిస్తామని, 200 మంది బాధితులకు న్యాయం జరిగే వరకు తగ్గేదే లేదని హెచ్చరించారు.

## ఇందిరమ్మ టవర్స్ LIG ఇళ్ల లబ్ధిదారులకు
# ఈ వారంలోనే కేటాయింపు పత్రాలు

- 6,643 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి – 5,521 మంది అర్హులుగా నిర్ధారణ
- బ్రోకర్లు, మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దు: వి.పి. గౌతమ్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**
ఇందిరమ్మ టవర్స్ LIG గృహాల లక్కీ డ్రా ద్వారా మొత్తం 7,340 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, వారిలో ఇప్పటివరకు 6,643 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తికాగా, 5,521 మంది అర్హులుగా నిర్ధారించబడ్డారని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ శ్రీ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు.మిగిలిన అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా నిర్ధారించబడిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక కేటాయింపు పత్రాలు (Allotment Letters) జారీ చేస్తామని తెలిపారు.లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు తమకు ఇల్లు కేటాయించబడుతుందా లేదా అనే ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన మరియు అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్యవర్తులు ఇల్లు మంజూరు చేయిస్తామని లేదా అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతూ అమాయక లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు."గృహాల కేటాయింపు ప్రక్రియలో బ్రోకర్లు, మధ్యవర్తులు లేదా ఇతర వ్యక్తులకు ఎలాంటి పాత్ర లేదు. లబ్ధిదారులు ఎవరికీ లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దు. గృహాల కేటాయింపు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన అర్హతలు మరియు అధికారిక ప్రక్రియ ఆధారంగానే జరుగుతుంది" అని శ్రీ వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు.గృహానికి సంబంధించిన మొదటి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లించాల్సిన మొత్తం, చెల్లింపు గడువు మరియు ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే అధికారికంగా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు.ఇతర వ్యక్తులు తెలిపే ఖాతాలకు లేదా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు జమ చేయవద్దని హెచ్చరించారు.

ఇల్లు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా లేదా అనధికారిక ఖాతాలకు చెల్లించాలని కోరినా వెంటనే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.లబ్ధిదారులు గృహాల కేటాయింపు, క్షేత్రస్థాయి పరిశీలన, కేటాయింపు పత్రాలు, మొదటి విడత చెల్లింపు తదితర అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ tghb.telangana.gov.in ను సందర్శించవచ్చు లేదా కాల్ సెంటర్ నంబరు 040-24603572ను సంప్రదించవచ్చు.తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారికంగా జారీ చేసే ప్రకటనలు, కేటాయింపు పత్రాలు , సంబంధిత అధికారుల సూచనలను మాత్రమే విశ్వసించాలని వైస్ ఛైర్మన్ , హౌసింగ్ కమిషనర్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# డిండి ప్రాజెక్టు కోసం మా గ్రామాలను ఇచ్చేది లేదు

- నాగర్ కర్నూలు ధర్నాలో జనసేన అధికార ప్రతినిధి హైందవి రెడ్డి స్పష్టీకరణ

**నాగర్ కర్నూలు వెలుతురు సెప్టెంబర్ 13:**
డిండి ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాలను త్యాగం చేసే ప్రసక్తే లేదని తెలంగాణ జనసేన పార్టీ అధికార ప్రతినిధి హైందవి రెడ్డి స్పష్టం చేశారు. నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు.ఈ సందర్భంగా హైందవి రెడ్డి మాట్లాడుతూ... దశాబ్దాలుగా నమ్ముకున్న భూములను, పుట్టి పెరిగిన ఊళ్లను ప్రాజెక్టుల పేరుతో బలవంతంగా లాక్కుంటే ఊరుకునేది లేదన్నారు. "డిండి ప్రాజెక్టు కోసం మా గ్రామాలను ఇవ్వడానికి సిద్ధంగా లేము" అని తేల్చిచెప్పిన ఆమె, నిర్వాసితులకు అన్యాయం చేసి అభివృద్ధి అంటే కుదరదని హెచ్చరించారు. ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని, ముంపు గ్రామాల ప్రజలకు తగిన న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ వారి వెంటే ఉంటుందని భరోసా కల్పించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, నిర్వాసితులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాజెక్టు బాధితుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నేతలు ప్రకటించారు.



# స్నేహితుల కరువు!

**స్నేహబంధాలు తగ్గిపోతున్న వేళ.. మేల్కొందాం**

ఇప్పుడు ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్యల్లో 'స్నేహితుల కొరత' కూడా ఒకటిగా మారింది. ఒకప్పుడు మనసు విప్పి మాట్లాడేందుకు, కష్టసుఖాలు పంచుకునేందుకు ఎంతోమంది స్నేహితులు ఉండేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ సన్నిహిత స్నేహబంధాలు తగ్గిపోతున్నాయి..

1960లలో ఒక వ్యక్తికి సగటున 100 మంది వరకు సన్నిహిత స్నేహితులు ఉండేవారట. 1990ల నాటికి ఆ సంఖ్య 50కి పడిపోయింది. 2020 నాటికి అది 10కి చేరిందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఒక్క నిజమైన స్నేహితుడిని సంపాదించుకోవడమే కష్టంగా మారింది. ఇటీవలి సర్వే ప్రకారం మన దేశంలో 12 శాతం మందికి చెప్పుకోదగ్గ స్నేహితుడే లేరట.ఒకప్పుడు రోజుకు కనీసం గంటసేపు స్నేహితులతో ముఖాముఖిగా గడిపేవాళ్లం. ఇప్పుడు ఆ సమయం సగటున 35 నిమిషాలకు తగ్గిపోయింది. మనసు విప్పి మాట్లాడే మనుషుల సంఖ్య కూడా తగ్గుతోంది.

### స్నేహం ఎందుకు అవసరం?

**1. స్నేహితులు లేని ఒంటరితనం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలు చుట్టుముడతాయి.**

**2. మంచి స్నేహితులున్నవారిలో ఒత్తిడి తగ్గడంతో పాటు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.**

**3. స్నేహితులు తోడుంటే ఆహ్లాదంగా ఉంటుంది. కలిసి వ్యాయామం చేయడం, ఆటలు ఆడటం, కొత్త పనులు చేయడం సులభమవుతుంది.**

**4. స్నేహం ఊరికే పుట్టదు. దానికి సమయం కావాలి. స్నేహం ఏర్పడిన తర్వాత దాన్ని నిలబెట్టుకోవడానికి కూడా సమయం కేటాయించాలి.**

**మొక్కకు నీళ్లు ఎంత అవసరమో.. స్నేహానికి 'కబుర్లు' అంతే అవసరం.**

**ఏవి నిజమైన స్నేహాలు?**

ఆఫీస్ స్నేహాలు: అవసరాల వరకే పరిమితమై, చాలాసార్లు బాహ్య పలకరింపులకే పరిమితమవుతున్నాయి.

సోషల్ మీడియా స్నేహాలు: చాలా వరకు కాలక్షేపానికే పరిమితమవుతున్నాయి.

బార్, రెస్టారెంట్ స్నేహాలు: కబుర్లు, నవ్వులతో సాగినా.. ఆ సందర్భం ముగిసిన తర్వాత చాలాసార్లు మాయమవుతున్నాయి.

స్నేహబంధాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణాల్లో సమయం లేకపోవడం ఒకటి. డబ్బు సంపాదించే యంత్రాల్లా మారిపోయి, బంధాలను నిలుపుకోవడం మర్చిపోతున్నాం.

**ఇప్పుడైనా మేల్కొందాం.. స్నేహాన్ని బతికించుకుందాం!**

**1. రోజులో కనీసం 15 నిమిషాలైనా స్నేహితులకు ఫోన్ చేద్దాం.**

**2. వారంలో ఒకసారైనా కలిసి మాట్లాడుకుందాం.**

**3. కల్మషం లేని సమయాన్ని కేటాయించి మనసారా మాట్లాడుకుందాం.**

**4. కలిసినప్పుడు ఫోన్ పక్కన పెట్టి.. మనసు పెట్టి మాట్లాడుకుందాం.**

**5. కొత్త స్నేహాలను పెంచుకుందాం. మనుషులతో మాట కలుపుదాం.**

**6. ఉన్న స్నేహాలను కాపాడుకుందాం. చిన్న చిన్న మనస్పర్థలకు స్నేహాన్ని వదులుకోవద్దు.**

**7. 'సారీ', 'థ్యాంక్స్' చెప్పడానికి వెనకాడవద్దు.**

**8. చాలాకాలంగా మాట్లాడని స్నేహితుడికి ఓ మెసేజ్ పెడదాం.. ఫోన్ చేద్దాం.**

**చివరి శ్వాస వరకు మనతో నడిచేది మంచి స్నేహితులే..స్నేహాన్ని బతికించుకుందాం!**



# పర్యావరణహితంగా గణేశోత్సవం



హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13: గణేశోత్సవానికి నగరవ్యాప్తంగా ఏర్పాట్లు ఉత్సాహంగా సాగుతున్న వేళ.. పర్యావరణ హితంగా వినాయక చవితిని నిర్వహించాల్సిన అవసరాన్ని పర్యావరణవేత్తలు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థలు గుర్తుచేస్తున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP), రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాలకు బదులుగా సహజ మట్టితో తయారు చేసిన గణేశ విగ్రహాలను ప్రోత్సహించాలని వారు సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యావరణహిత గణేశ విగ్రహాల తయారీపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**యువతలో పెరుగుతున్న ఆసక్తి**

యువత మట్టి గణేశ విగ్రహాల తయారీలో ఎంతో ఉత్సాహం చూపింది. యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, విఐపిలతో పాటు నటీనటులు, మోడల్లు మొదలైన వారు సోషల్ మీడియాలో అనేక మట్టి గణేష్ అవగాహన కార్యక్రమాలను అందించారు. ఇందులో భాగంగా ఆదివారం రిసెర్చ్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ జాలిగామ ఆధ్వర్యంలో మట్టి గణేశ విగ్రహాల తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి, యువత హాజరై స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేశారు.

**పర్యావరణ పరిరక్షణే లక్ష్యం**

ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మట్టి గణేశ విగ్రహాల తయారీ కేవలం కళను ప్రోత్సహించడం మాత్రమే కాదని, మన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతాయుతమైన ప్రయత్నమని తెలిపారు. గణేశ విగ్రహం తయారీ నుంచి పూజ, విసర్జన వరకు ప్రతి దశలోనూ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, సరస్సులు, ఇతర నీటి వనరులను పరిరక్షించడానికి ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంప్రదాయాన్ని పర్యావరణ హితంగా కొనసాగించాలి అని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయాన్ని కాపాడుకోవడంతో పాటు వాటి పేరుతో పర్యావరణానికి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పూజతో పాటు విసర్జన కూడా పర్యావరణహితంగా కావాలిగణేశోత్సవంలో పూజ ఎంత ముఖ్యమో.. విసర్జన కూడా అంతే బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. సహజ మట్టి, పర్యావరణహిత రంగులతో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి వనరులపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించవచ్చన్నారు.పూజ భక్తితో జరగాలి.. విసర్జన బాధ్యతతో జరగాలి అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**గణేశ పూజలో ప్రకృతికి ప్రత్యేక స్థానం**

భారతీయ సంప్రదాయంలో గణేశ పూజకు ప్రకృతితో అవినాభావ సంబంధం ఉందని ప్రవీణ్ కుమార్ వివరించారు. గణేశ పూజలో ఉపయోగించే 21 రకాల పత్రాల ప్రాధాన్యతపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. శమీ, భృంగరాజ్, బిల్వ, దూర్వ, బేర, ధత్తూర, తులసి, సెమ్, అపామార్గ, భటకటయ్య, సిందూర్, తేజపత్ర, అగస్త్య, కనేర్, కదళి, అర్క, అర్జున, దేవదారు, మరువ, గందారి (కచనార్), కేతకీ వంటి పత్రాలను పూజలో సమర్పించే సంప్రదాయం ఉంది. ఈ సంప్రదాయం ద్వారా మన పూర్వీకులు మొక్కలు, వృక్షజాలం, ప్రకృతి పట్ల గౌరవాన్ని కూడా వ్యక్తం చేశారని ప్రవీణ్ కుమార్ వివరించారుకి తదితర మొక్కల పత్రాలకు పూజా విధానంలో ఉన్న ప్రాధాన్యతను వివరించారు.ఈ పత్రాల సమర్పణను కేవలం పూజా క్రతువుగా కాకుండా, వృక్షాలను గౌరవించడం, జీవ వైవిధ్యాన్ని గుర్తించడం, ప్రకృతితో మనిషి అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం వంటి విలువలకు ప్రతీకగా కూడా వివరించవచ్చు.గణేశ పూజలో ఉపయోగించే పత్రాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం ద్వారా మన సంప్రదాయాలను తదుపరి తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం మరింత స్పష్టమైందని నిర్వాహకులు తెలిపారు.ఈ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలంటే చెట్లు, మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గణేశ పూజకు అవసరమైన పత్రాలు, పూలు, ప్రకృతి వనరులు భవిష్యత్ తరాలకు అందాలంటే చెట్లు, మొక్కలను సంరక్షించాలని సూచించారు. సంప్రదాయాల పరిరక్షణ అంటే కేవలం ఆచారాలను కొనసాగించడం మాత్రమే కాకుండా, వాటికి ఆధారమైన ప్రకృతిని కూడా కాపాడటమేనన్నారు. పండుగల సందర్భంగా ప్రకృతిని దెబ్బతీయకుండా, స్థానికంగా లభించే సహజ వనరులను గౌరవిస్తూ సంప్రదాయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, సరస్సులు, సహజ మట్టి వనరులను సంరక్షించడంతో పాటు వాటిపై ఆధారపడిన సంప్రదాయ వృత్తులను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

**భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం**

పిల్లలకు ఆస్తి, సంపదను అందించడం ఎంత ముఖ్యమో.. వారికి స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం కూడా అంతే ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు.ఈ వినాయక చవితి సందర్భంగా మట్టి గణేశుడిని పూజిద్దాం.. మన సంప్రదాయాన్ని కాపాడుకుందాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం అని ప్రజలకు పిలుపునిచ్చారు.



ఇట్లు
ప్రవీణ్ కుమార్ జలిగామ
M. Sc (జువాలజీ), M. Sc (ఎకాలజీ), B.Ed.
జువాలజీ లెక్చరర్ మరియు పర్యావరణ కార్యకర్త
వ్యవస్థాపక అధ్యక్షుడు
సొసైటీ ఫర్ ది రీసెర్చ్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్
మొబైల్ ఫోన్ నెంబర్ 9704841734.

## బ్రిక్స్" ప్రపంచ సమస్యలకు చూపుతుంది "ఫిక్స్"

ప్రపంచంలో నేడు అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకున్నాయి. రెండు యుద్ధాలు జరుగుతున్నాయి దాని వల్ల ప్రపంచంలో వాణిజ్యం, సరుకు రవాణా దెబ్బతింది ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో ద్రవయోల్బణం పెరిగిపోయింది దీనికి తోడు ప్రపంచ పెద్దన్న ఆయన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గారి దుందుడుకు నిర్ణయాలు గోరుచుట్టు పైన రోకటి పోటు అన్న చందంగా ఉంది. తనకు నచ్చిన విధంగా సుంఖాలని విధిస్తూ ప్రపంచ వాణిజ్యంలో తన రూటు సపరేటు అని గ్రీన్ ల్యాండ్ దేశాన్ని సైతం అమెరికాకి ఇచ్చేయమని శాసిస్తున్నాడు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో బ్రిక్స్ సదస్సుని భారతదేశం ప్రధాని నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో న్యూఢిల్లీలో అద్భుతంగా నిర్వహించడం బ్రిక్స్ దేశాలు అన్ని ముక్తకంఠంతో తమ ఉమ్మడి నిర్ణయాలని ప్రపంచం ముందు ఉంచటం నిజంగా సమకాలిన ప్రపంచ రాజకీయాలలో ఒక అద్భుతమనే చెప్పాలి. బ్రిక్స్ దేశాల జనాభా ప్రపంచంలో సగం జనాభా, ప్రపంచ వాణిజ్యంలో కూడా బ్రిక్స్ దేశాల వాటా సగం, ప్రపంచ జిడిపి లో కూడా బ్రిక్స్ దేశాల వాటా 40% అందుకే బ్రిక్స్ దేశాల నిర్ణయం ఆషామాషీ నిర్ణయాలు కావు ప్రపంచ దేశాల అనేక వ్యవహారాల్లో కీలకముద్ర వెయ్యనుంది. ఇష్టానుసారం సుంఖాలు విధించడం సమంజసం కాదని అమెరికాకి పరోక్షంగా సంకేతం ఇస్తే, యుద్ధాలతో సమస్యలకి పరిష్కారం దొరకవు కేవలం దౌత్యం ద్వారానే సాధ్యమని తోటి సభ్య దేశాలకు కూడా చెప్పటం, ఆదిపత్యంతో కాదు పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని చైనాకి తెగేసి చెప్పటం, ఏ పరిస్థితుల్లోనూ స్వేచ్ఛాయుత నౌక రవాణా వ్యవస్థకి అంతరాయాలు తగవు అని తేల్చి చెప్పటం, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిపై పోరికి అందరి సమ్మతి, బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం తమ డిజిటల్ కరెన్సీ ద్వారా చేసుకోవాలంటూ సుమారు 140 నిర్ణయాలు తీసుకోవటం శుభ పరిణామం. ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీ కౌన్సిల్ శాశ్వత సభ్య దేశంగా




భారతదేశాన్ని అనేక సందర్భాల్లో చైనా వ్యతిరేకిస్తూ ఉన్న నేపథ్యంలో బ్రిక్స్ సదస్సులో చైనా భారత దేశ శాశ్వత సభ్యత్వం కోసం తన అంగీకారాన్ని ప్రకటించడం బిక్స్ తీర్మానాలలో చేర్చటం భారతదేశ దౌత్య విజయంగా చెప్పక తప్పదు. భారతదేశ ప్రజల దయన్నదిక జీవితంలో బ్రిక్స్ దేశాల సాకారం ఎంతో ముఖ్యం. ప్రధానంగా మన దేశ ఇంధన అవసరాలన్నీ తీరుస్తోంది రష్యా, ఇరాన్, యూఏఈ దేశాలు. ఈ దేశాల సహకారం లేకపోతే మన పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతాయి. ఈ బ్రిక్స్ సమావేశం ద్వారా భారతదేశ ప్రజల అవసరాన్ని సుస్థిరం చేసుకోవడం జరిగింది. భారత రక్షణ వ్యవస్థకి రష్యా సహకారం ఎంతో ముఖ్యం ఈ ఆవశ్యకతని కూడా బ్రిక్స్ సమావేశం పూర్తి చేసింది. భారతీయ మహిళలకి ప్రీతిపాత్రమైన బంగారం ఎక్కువగా మనం దిగుమతి చేసుకునేది సౌత్ ఆఫ్రికా నుండి ఈ బ్రిక్స్ సమావేశం ద్వారా ఆదేశంతో మన మైత్రిని సుస్థిరం చేసుకున్నాం. భారతీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకి సెమీ కండక్టర్ తయారీకి సాంకేతికత అందించగలిగే దేశం చైనా ఈ దేశం తో కూడా మన సంబంధాలు మెరుగుపరుచుకున్నాం. 2047 కల్లా భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దటాకి ఈ బ్రిక్స్ సమావేశం చక్కటి పునాది వేసింది అని చెప్పక తప్పదు. అంతేకాదు ప్రపంచాన్ని వేధిస్తున్న అనేక సమస్యలకి ఈ బ్రిక్స్ చక్కటి ఫిక్స్ అందించటం సుస్పష్టం. ప్రపంచంలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోడీ గారు తన యొక్క రాజకీయ చతురత దౌత్యం ద్వారా ప్రపంచ దేశాల మన్నలను పొందటమే కాక ఆయా దేశాల సమస్యలకి పరిష్కారం ప్రత్యామ్నాయం చూపుతూ భారతదేశాన్ని నేర్పుగా ఓర్పుతో అభివృద్ధివైపు విజయ తీరాల వైపు నడిపిస్తున్న తీరు భారతీయులందరూ శభాష్ అనక తప్పదు.



పెద్దిరెడ్డి రవికిరణ్ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంధ్ర ప్రదేశ్

## మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

- వినాయక మండపాల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**సూర్యాపేట వెలుతురు సెప్టెంబర్ 13:**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందస్తు చర్యలు తీసుకుంటేనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించగలమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నివేదిత లక్షాది మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు. పీఓపీ విగ్రహాలు, వాటికి ఉపయోగించే రసాయన రంగుల వల్ల నీరు కలుషితమవడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు రెండు చొప్పున ఐదు అడుగుల మట్టి విగ్రహాలతో పాటు కాలుష్య నియంత్రణ మండలి అందించిన చిన్న మట్టి విగ్రహాలను కలిపి మొత్తం 1,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.అదేవిధంగా వినాయక మండపాల వద్ద పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండపాల పరిసరాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, చెత్తను తరలించేందుకు వచ్చే మున్సిపల్ ట్రాక్టర్ సిబ్బందికి అందజేయాలని కోరారు. మున్సిపల్ సిబ్బందితో మండపాల కమిటీ సభ్యులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో పండుగను నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రణయ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీవిద్య, కరుణాకర్, పోలగాని మాధవి, కృష్ణ, రాపర్తి భవాని, శ్రీనివాస్, గుణగంటి హేమ, సతీష్, నాగుల వాసు, కొణతం రాజేష్, బత్తుల మంగమ్మ, వెంకన్న, పిట్టల భవాని, రమేష్, గండూరి రమేష్, పిడమర్తి కీర్తి, లవన్, ఇందుశ్రీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎలుగురి ఇందిరా, వెంకన్న, మున్సిపల్ సిబ్బంది ఎం.డి. గౌసుద్దిన్, ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, యాదగిరి, అజిముద్దిన్, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణనాథులే మన సంస్కృతికి, పర్యావరణానికి రక్షణ: బండి రమేష్



**కూకట్ పల్లి సెప్టెంబర్ 13 వెలుతురు:**
పర్యావరణ పరిరక్షణతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ వసంత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్ పాల్గొని సర్దార్ పటేల్ నగర్, భగత్‌సింగ్ నగర్, వసంత్‌నగర్, మలేషియన్ టౌన్‌షిప్, గోపాల్‌నగర్, విశ్వాంబరి, శీలా పార్క్ కాలనీలలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ భాద్రపద మాసంలో జరుపుకునే వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని అన్నారు. మట్టి గణనాథులను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను ఇంట్లోని స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసి, అనంతరం మిగిలిన మట్టిని మొక్కలకు వేయడం ద్వారా సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని వివరించారు. తద్వారా భక్తితో కూడిన పూజా విధానంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడినవారమవుతామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని బండి రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిలారి బాబు, మలేషియన్ టౌన్‌షిప్ అధ్యక్షుడు కాకర్ల సురేష్ చౌదరి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, చావా శ్రీనివాసరావు, కొడప రామారావు, కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, రామ్ చౌదరి, లెక్చరర్ శ్రీనివాస్, నల్లమోతు ఫణి, శేషారావు, సురేష్, గంటా భీమేశ్వరరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పంపిణీ..



**కూకట్ పల్లి సెప్టెంబర్ 13 వెలుతురు:**
పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని పురంధర్ రెడ్డి కోరారు. గత పదేళ్లుగా కాలనీ ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఆర్. రామచంద్రరావుతో పాటు లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, సుబ్బారెడ్డి, నందు, అశ్విత్, రోహి త్, కళ్యాణ్ పాల్గొని కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి

- జిల్లా గణేష్ నేత

**కూకట్ పల్లి సెప్టెంబర్ 13 వెలుతురు:**



వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వివిధ వినాయక మండపాల నిర్వాహకులు నిర్వహించే పూజా కార్యక్రమాలకు హాజరుకావాల్సిందిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేతకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే వినాయక నవరాత్రులను ప్రతి కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆదిదేవుడైన శ్రీ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆయన ప్రార్థించారు. వినాయక మండపాల నిర్వాహక కమిటీ సభ్యులు నవరాత్రుల సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీలకు చెందిన వినాయక మండపాల కమిటీ సభ్యులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మంచినీటి బోరును ప్రారంభించిన దుండిగల్ పురపాలక తొలి చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు) సెప్టెంబర్ 13:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డివిజన్ కొరివి బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును దుండిగల్ పురపాలక తొలి చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ మాజీ ప్రజాప్రతినిధులు, బస్తీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా బస్తిలో పర్యటించి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముదిరాజ్ భవన్‌లో బస్తీ సభ్యులతో సమావేశమై రోడ్లు, డ్రైనేజీ, లైట్స్ మరియు ఇతర మౌలిక వసతుల సమస్యలపై చర్చించారు. స్థానికులు వివరించిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేష్, తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, జక్కుల శ్రీనివాస్ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, శంకర్ నాయక్, కుంటి నాగరాజు, సుధాకర్ రెడ్డి, భారత్ కుమార్, ప్యాక్ వైస్ చైర్మన్



నల్తూరి క్రిష్ణ, వార్డు ప్రెసిడెంట్ నర్సింగ్ గౌడ్, నాయకులు చిన్నంగి మల్లేష్, ఉప్పరి క్రిష్ణ ముదిరాజ్, ఈ. శ్రీనివాస్, ఆకుల భాస్కర్, యూత్ సభ్యులు ఉప్పరి శివ, నాగరాజు ముదిరాజ్, సతీశ్ ముదిరాజ్, ఉప్పరి శివ భార్గవ్, శ్రీకాంత్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, కోర్వి సత్యనారాయణ, వేణు ముదిరాజ్, తదితరులతో పాటు మహిళలు, యువ నాయకులు, బస్తీ సభ్యులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజులు గడిచినా హామీలు అమలు కాలేదు..

- ప్రతి ఇంటికి 'బాకీ కార్డు' పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు..

**కూకట్ పల్లి సెప్టెంబర్ 13 వెలుతురు:**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఆరోపించారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ 33, 34, 35 బ్లాకుల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రకటించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు.

హామీలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించారని తెలిపారు. అయితే ప్రభుత్వం ఏర్పడి సుమారు వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేసేందుకే ప్రతి ఇంటికీ 'బాకీ కార్డు' అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మాధవరం రంగారావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, ఆంజనేయులు, సత్యనారాయణ, యశ్వంత్, బాబు, శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

## ఆయిమాత అమ్మవారి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 13:**
ఆదివారం 130 – సుభాష్ నగర్ డివిజన్ సుభాష్ నగర్‌లోని అయిమాత దేవాలయంలో సిర్వీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆయిమాత అమ్మవారి 611వ జయంతి & దేవాలయ 23వ వార్షికోత్సవ వేడుకలకు" బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆయి మాత కృపా కటాక్షాలు, సిర్వి సమాజ్ సంపూర్ణ మద్దతుతో నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన మీకు అందరికీ నా ధన్యవాదాలు. సమాజ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.అనంతరం సిర్వి సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని



ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిర్వి సమాజ్ అధ్యక్షులు రావత్ రాంజీ బర్ఫా, ఉపాధ్యక్షులు సోహన్ లాల్జీ పరిహార్ , దుర్గా రాంజీ ములేవా, కార్యదర్శి ప్రేమ్ పావార్, జాయింట్ సెక్రెటరీ మంగల్ పావార్, ట్రెజరర్ పవర్ లాల్ ఖగ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేరళ వాయిద్యాల నడుమ ఘనంగా గణేష్ ఆగమనం

- పర్వేదలో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా గణపతి స్వాగతం

**శంకర్‌పల్లి, వెలుతురు సెప్టెంబర్ 13 :**
శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన యువసేన యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని కేరళ సంప్రదాయ వాయిద్యాల నడుమ మేళతాళాలతో ఊరేగింపుగా మండపం వద్దకు తీసుకువచ్చారు.కేరళ సంప్రదాయ వాయిద్యాల ప్రత్యేక ఆకర్షణతో సాగిన గణేష్ ఆగమన్ కార్యక్రమం గ్రామంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పింది. వాయి ద్యాల మోతకు యువత ఉత్సాహంగా పాల్గొం



టూ గణపతిని స్వాగతించారు. భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి జైకొడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణపతిని మండపం వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి



శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ యువత, భక్తులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు తథ్యం: ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాబు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 13:**
ఆర్టీసీ కార్మికుల సంక్షేమం ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని అందుకే ఎంప్లాయిస్ యూనియన్ ను గెలిపించాలని కోరుతూ నేడు జీడిమెట్ల డిపో వద్ద జరిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బాబు పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.కేసీఆర్ హయాంలో నే ఆర్టీసీ కార్మికుల హక్కుల గురించి మాట్లాడిన ఏకైక సంఘం మనదేనని మొన్నటిసారి జరిగిన సమ్మెలో కూడా ప్రధాన పాత్ర వహించి విజయవంతం కావడానికి ముఖ్య కారణం ఎంప్లాయిస్ యూనియన్ అని అన్నారు.కానీ కొన్ని సంఘాలు గత కొన్ని సంవత్సరాలుగా మాట్లాడకుండా నేడు కార్మికులకు మాయమాటలు, అబద్దాలు చెప్పి మోసాగించడానికి వస్తున్నాయని దాన్ని గ్రహించిన కార్మికులు నేడు పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్ లో చేరుతున్నారని ఇక్కడ కూడా గెలుపు ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షులు ఉమా మహేష్, రీజినల్, నగేష్ పటేల్,వైస్ రెడ్డి, జోనల్ కార్యదర్శులు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కారం కోసం నిత్యం పనిచేసేది ఎర్రజండా అని కావున యూనియన్ ను గెలిపించుకొని ప్రభుత్వంలో విలీన అయ్యేంత వరకు కార్మికులు ఐక్యంగా ఉండాలని దానికి సిపిఐ



,ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.ఈ సమావేశానికి డిపో సెక్రటరీ డేనియల్ అధ్యక్షత వహించగా ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడుప్రవీణ్ పాటలు పది కార్మికులలో స్ఫూర్తి నింపారు.డిపో అధ్యక్షుడు పాషా,అశోక్, నారాయణ, ఖయూమ్, రాజేష్, భాస్కర్ లతో పాటు కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యడం జరిగింది.

## కుత్బుల్లాపూర్ 22/A కాలనీల ప్లాట్ల సమస్య పరిష్కరిస్తాం: కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 13:**
కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులలు కూన శ్రీశైలం గౌడ్ ని ఈరోజు చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో నియోజక వర్గంలోని పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారి యొక్క స్థలాలను 22/a ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవచ్చారు.అదే విధంగా కాలనీలలో నెలకొన్న అంతర్గత రోడ్లు డ్రైనేజీ మరియు కమ్యూనిటీ హాల్ లో నిర్మాణాన్ని చేపట్టాలని వారికి వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 22 /a ప్రొహిబిటెడ్ జాబితాలో కొన్ని వేల ఎకరాల భూములను మరియు ప్లాట్లను చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆ జాబితా నుండి మీ యొక్క ప్లాట్లను తొలగించేందుకు తక్షణమే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకుపోతానని అదేవిధంగా జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి



వారి యొక్క ప్లాట్లను ఆ జాబితా నుండి తొలగించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా పలువురు వినాయక పూజ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొనాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గుత్తా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

**మునుగనూరు వెలుతురు సెప్టెంబర్ 13:**
తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు గుత్తా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు మునగనూరులోని వారి నివాసంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మునగనూరు పరిధిలోని వివిధ కాలనీల ప్రెసిడెంట్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని గుత్తా వెంకటరెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు స్వీట్లు పంచారు. పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలను, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవను



పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధు లు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.


## ఉత్తమ ప్రతిభతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన ఎం.జోయెల్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 13:**
ఇటీవల తమిళనాడులో జరిగిన కరాటే పోటీలలలతో పాటు వివిధ పోటీల్లో దాదాపు 22 మెడల్స్ సాధించి తన ఉత్తమ ప్రతిభతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన క్రీడాకారుడు "ఎం.జోయెల్" వారి కుటుంబ సభ్యులతో కలిసి పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన "ఎం.జోయెల్" కు ఎమ్మెల్యే మెడల్స్, శాలువా తో అభినందించారు.అనంతరం వారు మాట్లాడుతూ.... పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. కరాటేతో పాటు వివిధ విభాగాల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన జోయెల్ రానున్న రోజుల్లో



మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో జోయెల్ కుటుంబ సభ్యులు రాజేష్, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే రాజగోపాల్‌రెడ్డి ఏకైక ఎజెండా



- అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి.
- కుంభం శ్రీనివాస్‌రెడ్డి

**మునుగోడు, సెప్టెంబర్ 13 (వెలుతురు):**
నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లక్ష్యమని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఖండించాలని సూచించారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. సోషల్ మీడియాలో కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని కోరారు. వినాయకుడి ఆశీస్సులతో వారం రోజుల్లో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రాంతానికి నీళ్లు రాకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ కోచింగ్‌కు ఆర్థిక సాయం

**మునుగోడు,సెప్టెంబర్ 13 (వెలుతురు):**
మండల పరిధిలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన బోసి నవ్య తండ్రి వెంకన్న, రేవెల్లి నవ్య తండ్రి యాదయ్య లు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నారు. వారి చదువుకు చేయూతనందించేందుకు బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గోలి లింగస్వామి రూ.10 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు.యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొడిగె అశోక్,గాదె నరేష్,బాతరాజు గోవిందు,కొండగిరి వేణు,ఆడేపు వెంకన్న, సంపంగి నరసింహ, పులకరం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు తన ఓటు హక్కును కోల్పోవద్దు



- అదనపు కలెక్టర్ బి. హరిసింగ్.

**మోత్కూరు, సెప్టెంబర్ 13,వెలుతురు :**
అర్హత కలిగిన ప్రతి ఓటరుతన ఓటు హక్కును కోల్పోకుండా జాబితాలో ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మోత్కూరు మున్సిపాలిటీలోని పలు పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బీఎల్‌వోల పనితీరు, ఓటర్లకు అందుతున్న సమాచారం తదితర అంశాలను పరిశీ లించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఓటర్లు అధికారులకు సహకరించాలని కోరారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్లక్ష్యం చేయకుండా స్వయంగా హాజరై తమ వివరణను సమర్పించాలని సూచించారు. అక్టోబర్ 7 వరకు గడువు ఉన్నందున, ఆ తర్వాత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఓటర్లలో అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు సవరణ ప్రక్రియలో భాగస్వాములయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోత్కూరు తహసీల్దార్ పి. జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమన్, జీపీఓలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి గణపతుల పంపిణీ

- నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
- తీగలగుట్టపల్లి మేయర్ క్యాంప్ కార్యాలయంలో విగ్రహాలు పంపిణీ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.అదేవిధంగా 22వ, 50వ డివిజన్ల పరిధిలోని చైతన్యపురి కాలనీలో, 14వ డివిజన్ చింతకుంటలో నిర్వహించిన ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాల్లోనూ మేయర్ పాల్గొని ప్రజలకు విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కాలుష్యానికి గురికాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.రసాయనాలు, ఇతర హానికర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులనే వినియోగించాలని సూచించారు."పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. మట్టి గణపతుల ప్రతిష్టాపనతో పచ్చని కరీంనగర్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని మేయర్ పిలుపునిచ్చారు.నగరంలోని అన్ని డివిజన్లలో మట్టి గణపతి విగ్రహాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మేయర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. కరీంనగర్‌ను పరిశుభ్రమైన, పచ్చదనం తో కూడిన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూనే ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని మేయర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణా రెడ్డి, గడ్డి ప్రదీప్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విట్టల్

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 13 :**

మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్ సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగా హైదరాబాద్ రాష్ట్రం భారత దేశంలో విలీనం కావడం జరిగిందని పేర్కొన్నారు.. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వాలు తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించకపోవడం పట్ల ఆయా పార్టీ నాయకులను విమర్శించారు.. ఈ కార్యక్రమంలో



మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బీజేవైఎం అధ్యక్షులు బుగుదాల కృష్ణ . పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులకు యూనియన్ టియుడబ్ల్యూజే అధ్యక్షులకు శాలువా సన్మానం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 13 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్.ఆసిఫ్.జిల్లా కమిటి సభ్యులు.హసీబ్ పటేల్.నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు సత్యం, ప్రధాన కార్యదర్శి కే. భూమయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బి. రాములు, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. జావిద్, ఉపాధ్యక్షులు బిరాదర్ సంగప్ప, జి. విఠల్, ఎన్. శ్రీనివాస్, మూడ అశోక్ కుమార్, నిసార్, కోశాధికారి నాథేక్, రవీందర్, సంయుక్త కార్యదర్శులు ఎం.ఏ. రషీద్, జైపాల్ రెడ్డి, అంజయ్య, అంబాదాస్, మాణిక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీరారెడ్డి మరియు పలువురు కార్యవర్గ



సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి మైనార్టీ మోర్చా నేత ఎండి ముజీబ్

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**



విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు వర్ధిల్లాలని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎండి ముజీబ్ మాట్లాడుతూ, సకల విఘ్నాలను తొలగించే ప్రథమ పూజ్యుడు వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, సమాజంలో సోదరభావం, శాంతి, ఐక్యత మరింత వర్ధిల్లాలని విఘ్నేశ్వరుని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## చిగురుమామిడి నూతన PACS చైర్మన్, సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 13:**

హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలంలో ఇటీవల PACS చైర్మన్‌గా నియమితులైన చిట్టుమల్ల రవీందర్ తో పాటు నూతనంగా నియమితులైన సభ్యులు హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన PACS చైర్మన్, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమను బాధ్యతల్లోకి తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన PACS చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ తో పాటు సభ్యులను అభినందించారు. రైతుల సంక్షేమం, సహకార రంగం బలోపేతం కోసం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.PACS ద్వారా రైతులకు అవసరమైన సేవలు మరింత మెరుగ్గా



అందేలా కృషి చేయాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని మంత్రి ఆకాంక్షించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతుల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కల్లుగీత కార్మిక పారిశ్రామిక సంఘం ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు

**మోత్కూరు, సెప్టెంబర్ 13, వెలుతురు :**

కల్లుగీత కార్మిక పారిశ్రామిక సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బిక్కేరు వాగు గుంటి పక్షాన పోటీ చేస్తున్న బుసిగంపల పుష్ప,సూధగాని కిష్టయ్య లు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లను తమ ఓటు మాకే వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సంఘం నాయకులు బుర్ర కృష్ణ, దాసగాని రమేష్, లోడే వెంకన్న బుర్ర శ్రీనివాస్, పరశురాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## కరీంనగర్ 48వ డివిజన్‌లో మట్టి వినాయకుల ను పంపిణీ చేసిన బిజెపి నేత అప్పాల శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**



పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వెస్ట్ జోన్ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అప్పాల శ్రీనివాస్ పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు, మట్టి కలుషితమై పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడంతో పాటు మన సాంప్రదాయాలను సమున్నతంగా నిలుపుకునేందుకు మట్టి వినాయకుల పూజ ఉత్తమమైన మార్గమని తెలిపారు. పర్యావరణహిత వేడుకలను జరుపుకోవడానికి ప్రజలంతా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్

- లక్ష్మీ సాయి మెడోస్, మధురానగర్ కాలనీలలో ఘనంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**అమీన్‌పూర్, వెలుతురు సెప్టెంబర్ 13:**

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రకృతికి హాని కలిగించని మట్టి వినాయకులనే పూజించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ బీరంగూడ డివిజన్, లక్ష్మీ సాయి మెడోస్ మరియు మధురా నగర్ కాలనీలలో స్థానికులతో కలిసి ఆయన మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమై మూగజీవాలతో పాటు మానవ మనుగడ కూడా ప్రమాదంలో



పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు నేర్పిన సంప్ర దాయ పద్ధతిలో మట్టితో చేసిన ప్రతిమలను పూజించడమే భారతీయ సంస్కృతి అని స్పష్టం చేశారు. కాలనీ వాసులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుండడం శుభపరిణామ మని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని కోరారు. ఈ కార్య క్రమం లో కాలనీ ప్రెసిడెంట్, నందారం సందీప్ గౌడ్, స ంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 12వ డివిజన్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం.. HDPE పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్

- 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**



నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం 30 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న HDPE పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ నిర్మా ణ పనులను చేపట్టినట్లు తెలిపారు.నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా మెరుగుపడేలా HDPE పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఫారంలు తప్పులు సవరణకు హియరింగ్



**మార్తాండ నగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**

ఎస్ఐఆర్ ఫారమ్‌లలో తప్పులు ఉన్న దరఖాస్తుదారులకు సవరణ చేసుకునే అవకాశం కల్పిస్తూ ఆదివారం ప్రత్యేక హియరింగ్ కార్యక్రమం నిర్వహించారు.మార్తాండ నగర్‌లోని న్యూ హాఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఆదివారం అయినప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా హాజరై ఫారమ్‌లలో ఉన్న తప్పులను పరిశీలించి, అవసరమైన సవరణలు చేసుకునేలా దరఖాస్తుదారులకు అవకాశం కల్పించారు. ఫారమ్‌లలో పేర్లు, వివరాలు తదితర అంశాల్లో తప్పులు ఉన్న వారికి హియరింగ్ ద్వారా సమస్యలను పరిశీలించి కరెక్షన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు హాజరై తమ వివరాలను సరిచేసుకున్నారు.



## కేజీ మటన్, లీటర్ పాలు తాగినా రాని శక్తి..

# ఇది గిన్నెడు తింటే బలం రెండింతలవుతుంది



వర్షాకాలంలో చల్లటి వాతావరణంలో వేడివేడిగా ఏదైనా రుచికరమైన, ఆరోగ్యకరమైన స్నాక్ తినాలనిపిస్తే, నల్ల శెనగల చాట్ సరైన మంచిది. ఈ రెసిపీ రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం రెండింటినీ అందిస్తుంది. నల్ల శెనగలు పోషకాల గని. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్, మెగ్నీషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి.కావలసిన పదార్థాలు: ఒక కప్పు నల్ల శెనగలు, ఒక కప్పు నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ ఆయిల్, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, అర టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ కారం, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టేబుల్ స్పూన్ చాట్ మసాలా, అర టేబుల్ స్పూన్ గరం మసాలా, ఒక పెద్ద టమాటా, ఒక పెద్ద ఉల్లిపాయ, కొత్తిమీర తరుగు, నిమ్మరసంను తీసుకోవాలి.



ముందుగా ఒక కప్పు నల్ల శెనగలను తీసుకొని శుభ్రంగా కడిగి, నీళ్లు పోసి కనీసం రెండు గంటలు నానబెట్టాలి. నానిన తర్వాత నీళ్లు వంపేసి, కుక్కర్‌లో శెనగలు, ఒకటిన్నర కప్పు నీళ్లు, కొద్దిగా ఉప్పు వేసి మూడు నుండి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. శెనగలు మెత్తగా ఉడికిన తర్వాత నీళ్లు వంపేసి పక్కన పెట్టుకోవాలి. మిక్సర్ జార్‌లోకి కొత్తిమీర ఆకులు, పుదీనా ఆకులు, చింపిన పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, బెల్లం, బ్లాక్ సాల్ట్, పొట్టు తీసిన వెల్లుల్లిపాయలు వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ముందుగా ఒక కప్పు నల్ల శెనగలను తీసుకొని శుభ్రంగా కడిగి, నీళ్లు పోసి కనీసం రెండు గంటలు నానబెట్టాలి. నానిన తర్వాత నీళ్లు వంపేసి, కుక్కర్‌లో శెనగలు, ఒకటిన్నర కప్పు నీళ్లు, కొద్దిగా ఉప్పు వేసి మూడు నుండి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. శెనగలు మెత్తగా ఉడికిన తర్వాత నీళ్లు వంపేసి పక్కన పెట్టుకోవాలి. మిక్సర్ జార్‌లోకి కొత్తిమీర ఆకులు, పుదీనా ఆకులు, చింపిన పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, బెల్లం, బ్లాక్ సాల్ట్, పొట్టు తీసిన వెల్లుల్లి పాయలు వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి.



స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడయ్యాక అర టీ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ ఆవాలు వేసి వేగించాలి. అవి చిటపటలాడాక, నీళ్లు వంపేసిన ఉడికించిన శెనగలను వేసి కలపాలి. ఇప్పుడు అర టీ స్పూన్ కారం ,ఒక టీ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ చాట్ మసాలా, అర టీ స్పూన్ గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి.స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడయ్యాక అర టీ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ ఆవాలు వేసి వేగించాలి. అవి చిటపటలాడాక, నీళ్లు వంపేసిన ఉడికించిన శెనగలను వేసి కలపాలి. ఇప్పుడు అర టీ స్పూన్ కారం ,ఒక టీ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ చాట్ మసాలా, అర టీ స్పూన్ గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి.



ఆ తర్వాత మనం గ్రైండ్ చేసి పెట్టుకున్న కొత్తిమీర పేస్ట్‌ను కూడా వేసి అంతా బాగా కలిసేలా మిక్స్ చేయాలి. ఒక నిమిషం పాటు వేగించి స్టవ్ ఆఫ్ చేసి పాన్‌ను పక్కకు తీసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన టమాటా, సన్నగా తరిగిన ఉల్లిపాయ, కొత్తిమీర తరుగు వేయాలి. చివరిగా ఒక నిమ్మకాయ పిండిన నిమ్మరసం లేదా రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం చేర్చి బాగా కలపాలి. నిమ్మరసం ఈ చాట్‌కు చాలా మంచి రుచిని ఇస్తుంది. ఆ తర్వాత మనం గ్రైండ్ చేసి పెట్టుకున్న కొత్తిమీర పేస్ట్‌ను కూడా వేసి అంతా బాగా కలిసేలా మిక్స్ చేయాలి. ఒక నిమిషం పాటు వేగించి స్టవ్ ఆఫ్ చేసి పాన్‌ను పక్కకు తీసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన టమాటా, సన్నగా తరిగిన ఉల్లిపాయ, కొత్తిమీర తరుగు వేయాలి. చివరిగా ఒక నిమ్మకాయ పిండిన నిమ్మరసం లేదా రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం చేర్చి బాగా కలపాలి. నిమ్మరసం ఈ చాట్‌కు చాలా మంచి రుచిని ఇస్తుంది.



అంతే, వేడివేడిగా, పుల్లపుల్లగా, కారకారంగా ఉండే హెల్దీ నల్ల శెనగల చాట్ రెడీ. దీనిని ఒక సర్వింగ్ బౌల్‌లోకి తీసుకొని వెంటనే తినండి. ఇది సింపుల్‌గా, హెల్దీగా ఉండే అద్భుతమైన స్నాక్. వారానికి ఒకసారి ఇలాంటి చాట్ చేసుకోవడం ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఈ రెసిపీని మీరు ఇంట్లో ట్రై చేసి వేడి వేడిగా తినండి. అంతే, వేడివేడిగా, పుల్లపుల్లగా, కారకారంగా ఉండే హెల్దీ నల్ల శెనగల చాట్ రెడీ. దీనిని ఒక సర్వింగ్ బౌల్‌లోకి తీసుకొని వెంటనే తినండి. ఇది సింపుల్‌గా, హెల్దీగా ఉండే అద్భుతమైన స్నాక్. వారానికి ఒకసారి ఇలాంటి చాట్ చేసుకోవడం ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఈ రెసిపీని మీరు ఇంట్లో ట్రై చేసి వేడి వేడిగా తినండి.





## తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

**నేషనల్ బీసీదళ్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు డి.వి.వి.సత్యనారాయణ**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:** మీ కుటుంబ ప్రగతికి, మీ లక్ష్యాలకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా ఆ గణపతి మిమ్మల్ని అనుగ్రహించాలని కోరుకుంటున్నాను. వాడవాడలా మండపాలు నెలకొల్పి భక్తి శ్రద్దలతో, ఆనందోత్సాహాలతో గ ణేశుని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులందరికీ మేలు జరగాలని ఆ వినాయకుని ప్రార్థిస్తున్నాను.


# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..292 మందిపై కేసులు

**సైబరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP అడ్మి న్, జి నరేందర ఈ డ్రైవ్‌లో భాగంగా 292 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.240 ద్విచక్ర వాహనదారులు,12 ఆటోలు,40 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —248 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -30 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -14 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (07.09.2026 to 12.09.2026) లో 681 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.18 మందికి జరిమానా, జైలు శిక్ష, 07 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,656 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.



# పేట్రేగిపోతున్న ఎక్సైజ్ కమిషనర్ అవినీతి అక్రమాలు

- **ప్రభుత్వ నిబంధనలకు పాతర... కాసులు ఇచ్చిన వారికి పోస్టింగ్స్**
- **గంజాయి కేసులోనూ కమీషనర్ నాటకాలు...!**
- **కోటి రూపాయలిస్తే కోర్టును మోసం చేసిన వారిని కాపాడటమేనా?**
- **ఒక్క గంజాయి కేసు.. పంచనామా ఫోర్జరీలు.. కోట్ల రూపాయల బదలాయింపు**
- **ఈగల్ టీంలు పెట్టినా.. ఈ అవినీతి అధికారుల నుంచి రక్షణ ఏదీ?**
- **ఎక్సైజ్ కమిషనర్ తీరుపై రాచాల యుగంధర్ గౌడ్ ధ్వజం**

**బషీర్ బాగ్ : సెప్టెంబర్ 13 ( వెలుతురు ):**

ఇటీవల ఎక్సైజ్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సీఐ, ఎస్ఐ బదిలీలపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచాల మాట్లాడుతూ..... రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తీవ్ర అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతని అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఆయనను రాష్ట్రం నుంచి సాగనంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సీఐ, ఎస్ఐ బదిలీలలో ప్రభుత్వ నిబంధనలకు పాతరేస్తు డబ్బులు ఇచ్చిన వారికే మంచి పోస్టింగ్స్ ఇచ్చారని విమర్శించారు. ఆయా పోస్టులను బట్టి ఒక్కో పోస్టుకు రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు ముడుపులు తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ అవినీతి బాగోతంలో కమిషనర్ తో పాటు మంత్రి సహాయకులు, గతంలో పనిచేసిన కొందరు ఉన్నతాధికారులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి రూ.కోట్లు దండుకున్నారని మండిపడ్డారు. దీంతోపాటు ఖమ్మం జిల్లా భద్రాచలంలో ఏసి ఎన్ఫోర్స్ మెంట్ ఒక గంజాయి కేసును పట్టుకొని పంచనామ రిపోర్టుతో సహా ఇద్దరు నిందితులను సీఐకి అప్పగిస్తే, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఇచ్చిన పంచనామాను సిఐ చింపేసి, ఇద్దరు నిందితుల్లో ఒక్కరినే చూపించి అధికారుల సంతకాలను తానే ఫోర్జరీ చేసి కోర్టుకు నివేదించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ విచారణ జరిపి కమిషనర్ గారికి రిపోర్టు చేస్తే కంటితుడుపు చర్యగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను అటాచ్ చేయడంతో పాటు సీఐని, కానిస్టేబుల్ ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో కూడా సీఐని డిస్మిస్ చేయకుండా కమిషనర్ దాదాపు రూ. కోటి లంచం తీసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుందన్నారు. ఫోర్జరీ సంతకాలు చేసిన సీఐపై ఎందుకు ఫోర్జరీ కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈమె గతంలో కూడా పట్టుకున్న గంజాయిని తక్కువగా చూపించి మిగిలిన గంజాయిని అమ్ముకుని రూ.కోట్లు దండుకున్నారని అనేక ఆరోపణలు ఉన్నాయి.ఒకవైపు ప్రభుత్వం ఈగల్ టీమ్ లను ఏర్పాటు చేసి డ్రగ్స్ నివారణ చర్యల కోసం కృషి చేస్తుంటే... ఇలాంటి



అవినీతి రాబందుల నుంచి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.న్యాయస్థానాలను సైతం తప్పుదోవ పట్టించిన అవినీతి అధికారులను కమిషనర్ ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు.ఎక్సైజ్ అధికారుల అవినీతి బాగోతానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమవద్ద ఉన్నాయని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, డిజి విజిలెన్స్ ను కలిసి పూర్తి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని, అంతేకాకుండా రాష్ట్ర హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కమిషనర్ హరికిరణ్ ను తిరిగి ఆంధ్ర ప్రాంతానికి సాగనంపే వరకు బీసీ పొలిటికల్ జెఎసి పోరాటం సాగిస్తోందని స్పష్టం చేశారు.మరి ఎక్సైజ్ శాఖలో ఇంత జరుగుతున్న కూడా సంబంధిత శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎందుకు మౌనం వహిస్తున్నారని, ఇదంతా మంత్రికి తెలిసి జరుగుతుందా? తెలియకుండా జరుగుతుందా? బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు వివి గౌడ్, మహేందర్ నాయుడు, గోటూరి రవీందర్ గౌడ్, బత్తుల జితేందర్, రేనట్ల మల్లేష్, ముత్యాల వినోద్ సాగర్, కృష్ణప్రసాద్, శ్రీధర్, సిద్దార్థ్ పాల్గొన్నారు.

# మూలవాసులపై ఆర్ఎస్ఎస్ దాడిని తిప్పికొడదాం

- దళిత హక్కులు, అస్తిత్వాన్ని కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలి.
- మారుపాక అనిల్ కుమార్, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**విశాఖపట్నం వెలుతురు సెప్టెంబర్ 13:**
దేశంలోని మూలవాసులైన దళిత, ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, జీవన విధానంపై ఆర్ఎస్ఎస్,బీజేపీ శక్తులు సాగిస్తున్న దాడులను తిప్పికొట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు.దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలు విశాఖపట్నంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.దళిత ,ఆదివాసీలు తరతరాలుగా అడవులు, భూములు, సహజ వనరులపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి హక్కులను రాజ్యాంగం, చట్టాలు స్పష్టంగా గుర్తించాయని అన్నారు. అయితే కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా అడవులు, ఖనిజ సంపద, భూములను అప్పగించే విధానాల ద్వారా మూలవాసుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు.ఆదివాసీలను వారి ప్రత్యేక అస్తిత్వం నుంచి దూరం చేసి, “ఒకే మతం—ఒకే సంస్కృతి” పేరుతో వారి ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానాలను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మతం పేరుతో ప్రజలను విభజించి, కుల—మత ఆధిపత్యాన్ని బలపరిచే రాజకీయాలను ప్రజలు ఐక్యంగా తిరస్కరించాలని పిలుపునిచ్చారు.దళిత ,ఆదివాసీల హక్కులు ఎవరో ఇచ్చిన దానధర్మాలు కావని, అవి రాజ్యాంగం కల్పించిన హక్కులని అనిల్ కుమార్ స్పష్టం చేశారు. అటవీ హక్కుల చట్టం రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ వంటి రక్షణలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములను అక్రమంగా ఆక్రమించడం, పోడు సాగుదారులను వేధించడం, వారి భూముల నుంచి నిర్వాసితులను చేయడం తక్షణమే నిలిపివేయాలని కోరారు.భూమి, అడవి, నీరు, సహజ వనరులపై మొదటి హక్కు అక్కడ తరతరాలుగా జీవిస్తున్న మూలవాసులదేనని అన్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీలను వారి భూముల నుంచి తరిమివేసి, సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.దళితులు, ఆదివాసీలు, బహుజనులు, మైనారిటీలు, కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రజాస్వామ్య—లౌకిక శక్తులతో కలిసి ఐక్యంగా నిలబడినప్పుడే మతతత్వ, కులతత్వ, ఆధిపత్య రాజకీయాలను ఎదుర్కోగలమని అన్నారు.మూలవాసుల హక్కులపై దాడి జరిగితే ప్రతి ప్రజాస్వామ్యవాది గొంతెత్తాలి. ఆదివాసీల అస్తిత్వంపై దాడి జరిగితే దళితులు, బహుజనులు ఐక్యంగా నిలబడాలి అని అనిల్ కుమార్ అన్నారు.దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భావం నుంచి సామాజిక న్యాయం, దళితుల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, కుల నిర్మూలన కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కూడా విస్తృత ఉద్యమాలను నిర్మిస్తామని చెప్పారు.మూలవాసులపై జరుగుతున్న ప్రతి దాడిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రతిఘటిస్తూ, వారి భూమి—అడవి,నీరు,జీవన హక్కుల పరిరక్షణ కోసం డి హెచ్ పి ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత,ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడడంతో పాటు, వారి భూమి, అడవులు, సహజ వనరులపై హక్కులను పరిరక్షించాలని మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ వార్షికోత్సవాల సభకు తెలంగాణ రాష్ట్రం నుండి కె యేసు రత్నం, బి అశోక్ ,పొన్నగంటి లావణ్య, ఎంగల ఆనందరావు, పి ఏసున్న, పొన్నగంటి రాజేష్, బి సంతోష, యం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.మారుపాక అనిల్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,9440482429 దళిత హక్కుల పోరాట సమితి (DHPS), తెలంగాణ



# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలేరు వెంకన్నను పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్



**కేసముద్రం వెలుతురు సెప్టెంబర్ 13:**
ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలేరు వెంకన్నను కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ ఆదివారం పరామర్శించారు.. ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయం స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న సమ్మిగౌడ్, వెంటనే ఆయన నివాసానికి వెళ్లాడు. వెంకన్న ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని, కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని, ఆరోగ్యంతో తిరిగి జనంలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నరేటి కొమురయ్య, ఉపాధ్యక్షులు బండారు సత్తయ్య, కార్యదర్శి శీలం యాకన్నా, రాచర్ల రాములు, పేటేరు వెంకన్న, బోయిని ఉప్పలయ్య, కాలేరు రామ్మూర్తి, కొనతం శ్రీనివాస్, బండి అశోక్, దొంతరాబోయిన రమేష్, మంద కొమరయ్య, బత్తుల రమేష్, భారతల రవి,కండ నాగన్న, కండే నాగేష్, గౌండ్ల కళ్యాణ్, అల్లాడి వెంకన్న, సోమరాపు హైదర్, నాగుల వెంకన్న, రాచర్ల నిరంజన్, గౌండ్యాల శ్రీనివాస్, గొడిశాల చిరంజీవి, బత్తుల వీరన్న, తీగల దశరథం, ఉమయ్య, నరేటి మల్లేష్, వల్లాల రాజేందర్, శ్రావణ్, కందుకూరి రాంబాబు, కోమీరా ప్రశాంత్, బూరుగడ్డ యాకన్న, రాచర్ల ప్రభాకర్, కాలేరు అవినాష్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కసారి సారీ చెప్తే మా మంత్రి పదవి పోయేది కాదు

- మాటమీద నిలబడే కుటుంబం మాది: కొండా మురళి



**వరంగల్ వెలుతురు సెప్టెంబర్ 13:**
వరంగల్‌లో కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి దంపతులు మంత్రి పదవి కోల్పోయిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను సారీ చెప్పమని అడిగారని, కానీ ఆమె అలా చెప్పలేదని మురళి చెప్పారు. 'ఒక్కసారి సారీ చెప్తే మా మంత్రి పదవి పోయేది కాదు. మాటమీద నిలబడే కుటుంబం మాదన్నారు.చెయ్యని తప్పుకు సారీ ఎందుకు చెప్పాలని పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ అని సారీ చెప్పలేదని కొండా మురళి అన్నారు. తమ బిడ్డకు తమకు సంబంధం లేదని, ఆమెకు 38 ఏళ్లు నిండాయని, ఆమె నిర్ణయాలు ఆమె స్వయంగా తీసుకుంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని మురళి నొక్కి చెప్పారు.సురేఖను గెలిపించడంలో రాహుల్ గాంధీ పాత్ర ఉందని గుర్తు చేశారు. పదవులు ఇవాళ వస్తాయి, రేపు పోతాయని, మాట కోసం తాము నిలబడతామని అన్నారు. కృతజ్ఞత అన్నది తమ రక్తంలోనే, తమ కుటుంబం లోనే ఉందని కొండా మురళి అన్నారు. కార్యకర్తలే తమ బలం, బలహీనత అని కొండా మురళి వ్యాఖ్యానించారు, వాళ్ళ కోసం ఏమైనా చేస్తానని అన్నారు.అవసరం అయితే వాళ్ళ కోసం మరో 10 ఎకరాలు అమ్ముతానని అన్నారు. బీసీల కోసం ముందుకు వచ్చే నాయకులే లేరని అన్నారు. తన శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయన్నారు.మీ ఆశీస్సులు నన్ను బతికిస్తున్నాయన్నారు. పార్టీలో ఉండి పార్టీకి వెన్నుపోటు పొడవద్దని అన్నారు. కొండా మురళి కబ్జాలు చేసినట్టు నిరూపిస్తే రాజకీయాల నుండి బయటకు వెళ్తా అన్నారు.గెలిచే వాళ్ళకే వరంగల్ మున్సిపల్ టికెట్లు ఇస్తామన్నారు. మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో 24మంది కార్పొరేటర్ లను గెలిపిస్తానన్నారు.వరంగల్ తూర్పు బాధ్యతలు నవీన్ రాజుకు అప్పగిస్తున్నానని చెప్పారు. తన కారు రంగు ఇండియాలోనే ఉందని, అది ముస్లిం లకు చిహ్నం అన్నారు. అన్ని వర్గాలను కలుపుకుని పని చేస్తామన్నారు.

**అజ్ఞాతం వీడిన కొండా కపుల్: క్యాడర్ తో కీలక సమావేశం, ఢిల్లీ పిలుపుతో ప్రత్యర్థుల్లో టెన్షన్!**

బసవరాజు సారయ్యను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని, దమ్ముంటే ఆయన కూడా రాజీనామా చేయాలని సవాలు వేశారు. ఇంకో కొన్ని రోజుల్లో ఎమ్మెల్సీ పోతుందని రేవంత్ రెడ్డి ఇస్తాడని అనుకుంటున్నాడని, కానీ ఆయనకు మళ్లీ ఎమ్మెల్సీ రాదని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై దంపతులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. మళ్ళీ కొండా సురేఖకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొండా దంపతులు ఇకపై కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని స్పష్టం చేశారు.

# దాల్చిన చెక్క వెనుక ఇంత కథ ఉందా? ఎలా సేకరిస్తారో తెలుసా?

దాల్చిన చెక్కను చెట్టు బెరడు నుండి సేకరించే ప్రక్రియ ఆశ్చర్యకరం. రైతులు చేదు పొరను తొలగించి లోపలి పొరను మాత్రమే తీసుకుంటారు. గర్డలింగ్ వంటి కొత్త పద్ధతులతో చెట్టుకు హాని కలిగించకుండానే ఏడాది పొడవునా బెరడును సేకరించవచ్చు. అక్టోబర్—నవంబర్ కాలంలో సేకరించిన దాల్చిన చెక్కలో సుగంధ తైలాలు అధికంగా ఉంటాయి, ఇది దాని రుచిని, వాసనను ప్రత్యేకంగా చేస్తుంది.మన వంటింట్లోని మసాలా దినుసుల్లో దాల్చిన చెక్కకు ప్రత్యేకమైన స్థానం ఉంది. కమ్మని వాసన, ప్రత్యేకమైన రుచి, ఘాటు కారణంగా కూరలు, స్వీట్లు, టీ, పానీయాల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తాం. అయితే మనం చిన్న చిన్న ముక్కలుగా చూసే ఈ దాల్చిన చెక్క ఎలా తయారవుతుందో తెలుసా? చెట్టును నరికేసి దాల్చిన చెక్కను తీస్తారనుకుంటే అది పొరపాటే! దాల్చిన చెక్క తయారీ వెనుక ప్రత్యేకమైన వ్యవసాయ పద్ధతి ఉంటుంది. దాల్చిన చెట్టు కాండంపై ఉండే బెరడును రైతులు ప్రత్యేకమైన కత్తులతో జాగ్రత్తగా తొలగిస్తారు. ముందుగా చెట్టు పైభాగంలో ఉండే బాహ్య పొరను గీకేస్తారు. ఆ తర్వాత లోపలి వైపు ఉండే పలుచని, సుగంధభరితమైన బెరడు పొరను వేరు చేస్తారు. ఇదే మనకు మార్కెట్లో దొరికే దాల్చిన చెక్కకు ప్రధాన ముడి పదార్థం.

**చెట్టు బెరడు తీస్తే చనిపోతుందా?**

దాల్చిన చెట్టు బెరడును తొలగిస్తే చెట్టు చనిపోతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ అది పూర్తిగా నిజం కాదు. దాల్చిన చెక్క సాగులో చెట్టును ఎలా నిర్వహిస్తారన్నదే కీలకం. గతంలో కొన్ని ప్రాంతాల్లో చెట్టును నేల దగ్గర నరికేసి, మిగిలిన మొద్దు నుంచి వచ్చే కొత్త చిగుళ్లను పెంచే పద్ధతిని కూడా అనుసరించేవారు. ఆ కొత్త కొమ్మలు పెరిగి కొన్ని సంవత్సరాల తర్వాత మళ్లీ కోతకు సిద్ధమవుతాయి. ప్రస్తుతం చెట్టుకు సాధ్యమైనంత తక్కువ నష్టం కలిగిస్తూ బెరడును సేకరించే పద్ధతులకు ప్రాధాన్యం పెరుగుతోంది. సరైన పద్ధతిలో నిర్వహిస్తే ఒకే చెట్టు నుంచి వరుసగా ఉత్పత్తి పొందే అవకాశం ఉంటుంది. దీంతో దాల్చిన చెక్క సాగు మరింత సుస్థిరంగా కొనసాగుతుంది.

**సంవత్సరానికి రెండుసార్లు కోత!**

దాల్చిన చెక్కలో మరో ఆసక్తికరమైన విషయం దాని కోత సమయం. బెరడును సేకరించే కాలాన్ని బట్టి దాని నాణ్యత, సువాసన, రుచిలో కొంత మార్పు కనిపించవచ్చు. సాధారణంగా ఏడాదిలో రెండు సార్లు బెరడు సేకరించే పద్ధతులు ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలం తర్వాత, మొక్కలో రసం ప్రవాహం అనుకూలంగా ఉన్న సమయంలో బెరడు వేరు చేయడం సులభంగా ఉంటుంది. అక్టోబర్—నవంబర్ సమయంలో సేకరించే బెరడుకు మంచి సువాసన, ఘాటు ఉంటాయని సాగుదారులు చెబుతారు.

**చెట్టు నుంచి నేరుగా మన వంటింటికి రాదు!**




చెట్టు నుంచి బెరడును తొలగించిన వెంటనే అది మనం ఉపయోగించే దాల్చిన చెక్కగా మారిపోదు. సేకరించిన బెరడును ముందుగా శుభ్రపరిచి, తగిన విధంగా ఎండబెడతారు. ఆ తర్వాత బెరడును చుట్టేలా చేసి, నొక్కి, అవసరమైన పరిమాణంలోకి తీసుకొస్తారు. ఎండే సమయంలో బెరడు తనకు ప్రత్యేకమైన ఆకారం, రంగును సంతరించుకుంటుంది. చివరకు మనం దుకాణాల్లో చూసే చిన్న చిన్న దాల్చిన చెక్క ముక్కలు లేదా స్టిక్స్ తయారవుతాయి.

**అసలు సీక్రెట్ ఇదే!**

దాల్చిన చెక్క అంటే చెట్టు కలపలోని సాధారణ భాగం కాదు. చెట్టు బెరడులోని ప్రత్యేకమైన పొరనే ప్రధానంగా ఉపయోగిస్తారు. ఆ బెరడులో ఉండే సుగంధ సమ్మేళనాలే దాల్చిన చెక్కకు మనకు తెలిసిన ప్రత్యేకమైన వాసన, రుచిని ఇస్తాయి. అందుకే మన వంటింట్లో చిన్న ముక్కగా కనిపించే దాల్చిన చెక్క వెనుక వ్యవసాయం, సరైన కోత సమయం, బెరడు సేకరణ, ఎండబెట్టడం, ప్రాసెసింగ్ వంటి అనేక దశలు ఉంటాయి. ఇక నుంచి టీ లేదా కూరలో దాల్చిన చెక్క ముక్క కనిపించినప్పుడల్లా.. అది చెట్టును నరికేసి చేసిందే కాదని గుర్తుంచుకోండి!

# “మనది అనుకుంటే వదలకు”

మనసుకు నిజంగా నచ్చిన లక్ష్యం, విలువైన స్నేహం లేదా పరస్పర ప్రేమ ఉన్న బంధాన్ని చిన్న అపార్థాలు, తాత్కాలిక కష్టాలు, ఇతరుల విమర్శల కారణంగా తొందరపడి వదులుకోకూడదు.అయితే “మనది” అంటే మన సొంతం లేదా మన అధికారం అని కాదు. అది మన జీవితానికి మంచిదని, మన విలువలకు సరిపోతుందని, ఇరువురికీ గౌరవం ఉందని గుర్తించడం. ముఖ్యంగా బంధాల్లో ఎదుటివారి ఇష్టం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కూడా సమానంగా ముఖ్యమైనవి.

**“పట్టుదలతో, ప్రేమతో సాధించు”**

లక్ష్యాలను పట్టుదలతో సాధించాలి. బంధాలను ప్రేమతో నిలబెట్టుకోవాలి. పట్టుదల మాత్రమే ఉండి ప్రేమ లేకపోతే అది మొండితనంగా మారుతుంది. ప్రేమ మాత్రమే ఉండి ప్రయత్నం లేకపోతే అది కేవలం కోరికగా మిగిలిపోతుంది.అందుకే మనం కోరుకున్నదాన్ని సాధించడానికి——నిజాయితీగా ప్రయత్నించాలి.

- **ఓర్పుతో ఎదురుచూడాలి.**
- **సమస్యలను మాట్లాడుకొని పరిష్కరించాలి.**
- **అవసరమైన చోట మన తప్పును సరిదిద్దుకోవాలి.**
- **ఎదుటివారిపై ఒత్తిడి చేయకుండా గౌరవించాలి.**
- **మన ప్రయత్నం బలవంతం కాకూడదు; మన పట్టుదల మరొకరి స్వేచ్ఛను హరించకూడదు.**

**“వద్దు అనుకుంటే ఆలోచించకు”**

ఒక వస్తువు, బంధం లేదా అవకాశం మనకు అవసరం లేదని స్పష్టంగా నిర్ణయించుకున్న తర్వాత దాని గురించే పదేపదే ఆలోచిస్తూ మనశ్శాంతిని కోల్పోకూడదు.వదిలేసిన విషయాన్ని మళ్లీ మళ్లీ తలచుకోవడం వల్ల నిర్ణయం మారకపోయినా మన బాధ మాత్రం పెరుగుతుంది. అందుకే సరైన కారణాలతో నిర్ణయం తీసుకున్న తర్వాత గతాన్ని తవ్వకుండా ముందుకు సాగాలి.అయితే ఆవేశంలో “వద్దు” అనుకోకూడదు. ప్రశాంతంగా ఆలోచించి, మంచి—చెడులను అంచనా వేసి నిర్ణయం తీసుకోవాలి. ఆలోచించి తీసుకున్న నిర్ణయాన్ని మాత్రం అనవసరమైన పశ్చాత్తాపంతో భారంగా మార్చుకోకూడదు.

**“చిరునవ్వుతో తిరస్కరించు——సున్నితంగా”**

మనకు నచ్చని ప్రతిదానినీ కోపంతో, అవమానంతో తిరస్కరించాల్సిన అవసరం లేదు. “లేదు” అని చెప్పడం కూడా ఒక కళ. ఎదుటివారి మనసును గాయపరచకుండా, మన హద్దులను స్పష్టంగా తెలియజేయవచ్చు.సున్నితంగా తిరస్కరించడం బలహీనత కాదు; అది మన సంస్కారం. అంగీకరించలేని దాన్ని స్పష్టంగా చెప్పడం ఆత్మగౌరవం. కానీ చెప్పే విధానంలో మర్యాద ఉండటం మానవత్వం. “అది వస్తువైనా, స్నేహమైనా, బంధమైనా, లక్ష్యమైనా...”

- **వస్తువు: నిజంగా అవసరమైతే కష్టపడి సంపాదించాలి. కేవలం ఇతరుల దగ్గర ఉందని ఆశపడకూడదు.**
- **స్నేహం: నిజమైన స్నేహంలో అపార్థాలు వస్తే మాట్లాడుకొని పరిష్కరించాలి. కానీ అవమానం, మోసం, స్వార్థం మాత్రమే ఉన్న స్నేహాన్ని బలవంతంగా కొనసాగించకూడదు.**
- **బంధం: పరస్పర ప్రేమ, గౌరవం ఉంటే కాపాడుకోవాలి. ఒక్కరే త్యాగం చేస్తూ, మరొకరు ఉపయోగించుకునే బంధంలో మాత్రం హద్దులు పెట్టుకోవాలి.**
- **లక్ష్యం: మనసుకు నచ్చిన లక్ష్యం కోసం ఓటములను తట్టుకొని ప్రయత్నించాలి. మార్గం కష్టంగా ఉందని లక్ష్యాన్ని వదిలేయకూడదు. కానీ అది మన ఆరోగ్యాన్ని, విలువలను, జీవితాన్ని నాశనం చేస్తుంటే మార్గాన్ని మార్చుకోవాలి.**

**ఈ సందేశంలోని అసలైన భావం**

జీవితంలో ప్రతి దానినీ పట్టుకొని బాధపడకూడదు; ప్రతి దానినీ తొందరపడి వదిలేయకూడదు. దేనికోసం పోరాడాలో, దేనిని ప్రశాంతంగా వదిలేయాలో తెలుసుకోవడమే పరిపక్వత.

- **విలువైనదైతే ప్రేమతో కాపాడుకో.**
- **సాధించదగినదైతే పట్టుదలతో ప్రయత్నించు.**



- **నీకు సరిపోనిదైతే సున్నితంగా తిరస్కరించు.**
- **వదిలేసిన తర్వాత పశ్చాత్తాపంతో వెనక్కి చూడకుండా చిరునవ్వుతో ముందుకు సాగు.**

మీ నక్క యాదగిరి

## పొన్నం సత్తయ్య గారి జీవితం గొప్ప ఆదర్శం



- తన పిల్లలు జీవితంలో ఎదిగి, ప్రయోజకులుగా నిలవడం చూసినప్పుడు ఒక తండ్రికి కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది.
- టిపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగం

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

- పొన్నం సత్తయ్య గారు భౌతికంగా మన మ ధ్య లేకపోయినా, ఆయన ఆశయాలను ము గ్గురు కుమారులు ముందుకు తీసుకెళ్తున్నారు.
- పెద్ద కుమారుడు అశోక్ గౌడ్ న్యాయరంగంలో రాణిస్తున్నారు.
- రెండో కుమారుడు రవిచంద్ర రెడ్డి జర్నలిజం రంగంలో మంచి స్థాయిలో ఉన్నారు.
- మూడో కుమారుడు పొన్నం ప్రభాకర్ గారు రాజకీయ రంగంలో రాణిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు.
- ఇద్దరు కుమార్తెలు కూడా తమ జీవితాల్లో మంచి స్థాయిలో ఉన్నారు.
- వారి పిల్లలు కూడా వివిధ రంగాల్లో రాణించడం పొన్నం సత్తయ్య గారికి నిజమైన ఆనందం కలిగించే విషయం.
- పొన్నం సత్తయ్య గారి జీవితాంతం వ్యవసాయంపై ఆధారపడి కష్టపడ్డారు.
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలంలో కష్టపడుతూ కుటుంబాన్ని ముందుకు నడిపించారు.
- వ్యవసాయం చేస్తూనే పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే దూరదృష్టి ఆయనది.
- వ్యవసాయ కుటుంబంలో పుట్టినా పిల్లలు ఉన్నతంగా ఎదగాలని భావించి వారికి మంచి విద్య అందించారు.
- తండ్రి కష్టానికి, దూరదృష్టికి నేటి వారి విజయాలే నిదర్శనం.
- పొన్నం కుటుంబం ఇప్పటికీ ఉమ్మడి కుటుంబ విలువలను కాపాడుకుంటూ ఉండటం అభినం దనీయం.
- నేటి కాలంలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు తగ్గుతున్న సమయంలో ఇది అందరికీ ఆదర్శం.
- కష్టసమయంలో ఒకరికొకరు అండగా నిలవడం ఉమ్మడి కుటుంబం గొప్పతనం.
- ఎన్నో సంవత్సరాలుగా దగ్గరగా చూస్తున్న వ్యక్తిగా పొన్నం ప్రభాకర్ గారి కష్టపడి పనిచేసే తత్వాన్ని గుర్తు చేసుకోవాలి.
- వ్యవసాయం పట్ల ఆయనకు ప్రత్యేకమైన ప్రేమ, అనుబంధం ఉంది.
- రైతులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.
- వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అభినం దనీయం.
- జానపద కళారంగంలో ప్రతిభ చూపుతున్న కళాకారులను గుర్తించి పురస్కారం అందించడం అభినందనీయం.
- ముఖ్యంగా ప్రతిభ ఉన్నవారికి అవకాశం కల్పించడం ద్వారా కళారంగాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.
- పురస్కారం పరిమాణం చిన్నదైనా, సమాజానికి ఇచ్చే సందేశం చాలా పెద్దది.
- ప్రతిభ ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణిస్తారు.
- సమాజంలో ఎన్నో ప్రతిభలు అవకాశాలు లేక మట్టిలోనే కలిసిపోతున్నాయి.
- సరైన సమయంలో సరైన అవకాశం లభిస్తే అ లాంటి ప్రతిభలు మాణిక్యాలుగా వెలుగులోకి వస్తాయి.
- వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకు న్నవారే జీవితంలో స్థాయికి ఎదుగుతారు.
- ప్రతిభావంతులను గుర్తించి ఈ పురస్కా రాలకు ఎంపిక చేసిన జ్యూరీ కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు.
- ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిభను ప్రోత్సహిస్తున్న నిర్వాహ కులకు అభినందనలు.
- పొన్నం ప్రభాకర్ 1985 నుండి పరి చయం..బలవంతంగా రాజకీయాల్లోకి తెచ్చా
- వాళ్ళ అన్న పొన్నం అశోక్ నాకు పరిచయం..
- పొన్నం ప్రభాకర్ ను రాజకీయాల్లోకి రమ్మంటే నాకెందుకు అన్నారు.. ఈరోజు మంత్రి అయ్యారు..
- పక్కనే ఉన్న గిడుగు రుద్రరాజు ,పొన్నం ప్రభాకర్ నాకు రాజకీయాల్లో ప్రియ శిష్యులు
- ఎన్నో పోరాటాలు చేశాం.. లాఠీ దెబ్బలు తిన్నాం..
- ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలి .అనేక మందిని సత్కరించాలి..

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చిన మంత్రి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "బుద్ధికి, జ్ఞానానికి,విజయానికి అధిపతి వినాయకుడు.మనం ఏం పని ప్రారంభించినా ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండాలని మొదట గణపతిని పూజి స్తామని,ఆ లంబోధరుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్ట ఐశ్వర్యాలు కలగి ఉండాలని, ప్రజలు ప్రారంభించే అన్ని పనుల్లో మంచి జరగాలని" మంత్రి ఆ వినాయకుడిని ప్రార్థించారు."ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలోని ప్రజా ప్రభుత్వం అత్యంత పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టిందని,రాష్ట్ర వ్యాప్తంగా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తు న్నామని మంత్రి గుర్తు చేశారు. ఈ వినాయక చవితి నవరాత్రులు ప్రజలంతా సమిష్టిగా అత్యంత భక్తి



శ్రద్ధలతో జరుపుకోవాలని" మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.




## వినాయక చవితి, నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

వినాయక చవితి, నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నే శ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయు రారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలం తా భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని, పర్యావరణ పరిర క్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

### విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో

తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ, ప్రతి కు టుంబం ఆనందంగా, సుభిక్షంగా ఉండేలా ప్రజా ప్రభుత్వం చేపడు తున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని గణనా థుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.వినాయక



చవితి, నవరాత్రుల పర్వదినాలు ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ... రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు.

## విఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఇంటా వెలుగులు నిండాలి

- రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు
- సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని, కుటుంబాల్లో ఆనందం వెల్లివిరి యాలని ఆకాంక్షించారు. గణపతి పూజ ద్వారా మంచి ఆలోచనలు, సత్ప్రవర్తన, పరస్పర సహకారం పెంపొందాలని ఆకాంక్షించారు. పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజలతో ఆనందంగా జరు పుకోవాలని సూచించారు.విగ్రహాల తయారీ, నిమజ్జనంలో పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటలు, జలాశయాల పరిశుభ్రతకు భంగం కలగకుండా సంబంధిత శాఖల సూచనలను పాటించాలని కోరారు. పండుగ సందర్భంగా శబ్ద కాలుష్యం, ఇతరులకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.వినాయక మండపాల నిర్వహణలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి కోరారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రభుత్వ విభాగాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ప్రజలంతా పరస్పర గౌరవం, స్నేహభావంతో పండుగను జరుపుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ మరింత ప్రగతి సాధించాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.గణపతి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలకు మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు, శ్రేయస్సు చేకూరాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి బాటలో పయనించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.

# రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ రవాణా మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించిన వారమవుతామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి, శాంతి, సోదరభావంతో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను



పాటించాలని మంత్రి సూచించారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి వెల్లివిరియాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# బాల్యమిత్రుడికి ప్రధాని మోదీ అభయం.. కదిలిన యంత్రాంగం

**ఢిల్లీ వెలుతురు సెప్టెంబర్ 13:**
తన 37 ఏళ్ల క్రితం నాటి భూవివాదాన్ని పరిష్కరించాలని అస్గర్ అలీ వోహ్రా (81) తన బాల్య మిత్రుడు ప్రధాని మోదీని కోరారు. అందుకు ప్రధాని మోదీ అభయమిచ్చారు. గుజరాత్‌లోని వద్‌నగర్‌లో ప్రధాని మోదీతో కలిసి చదువుకున్న 81 ఏళ్ల అస్గర్ అలీ వోహ్రా తన భూ వివాదంపై జోక్యం చేసుకోవాలని ప్రధానిని అభ్యర్థించారు. మహారాష్ట్రలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భూ వివాదంపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఆయన కోరారు.మహారాష్ట్రలోని మీరా రోడ్ ప్రాంతానికి చెందిన అస్గర్ అలీ వోహ్రా (81) ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నేరుగా కలిశారు. 1989లో ముంబై భాయందర్ ఈస్ట్ పరిధిలోని నవ్‌ఘర్ ప్రాంతంలో సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని తాను రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.అయితే 2011లో 'స్వయం బిల్డర్స్', స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు చెందిన 'సెవెన్ ఎలెవన్ కన్ స్ట్రక్షన్' సంస్థలు తన భూమిని కబ్జా చేశాయని వోహ్రా ఆరోపించారు. అసలు యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని రెండు భాగాలుగా విభజించి ఆ రెండు సంస్థల పేరిట ఆక్రమించుకున్నారని ఆయన వాపోయారు.ఈ భూ వివాదానికి సంబంధించి 2015లోనే ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ, కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. దశాబ్దాలుగా రెవెన్యూ శాఖ, మున్సిపల్ అధికారులు, పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగకపోవడంతో చివరికి ఆయన ప్రధాని మోదీని ఆశ్రయించారు. తన గోడు వెళ్లబోసుకున్న వోహ్రాకు ప్రధాని సానుకూలంగా స్పందించి అభయమిచ్చారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయక్ విడుదల చేయగా, ప్రధాని తన బాల్య స్నేహితుడికి తగిన న్యాయం అందేలా చూస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రధాని కార్యాలయ జోక్యంతో కదిలిన మున్సిపల్ యంత్రాంగం .

ఈ ఉదంతంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 16న ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక విచారణకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా 'సెవెన్ ఎలెవన్ కన్ స్ట్రక్షన్', 'స్వయం బిల్డర్స్' ప్రతినిధులకు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు.

# ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎంరేవంత్ రెడ్డి

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగినవారని సీఎం అన్నారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ సమాజంలో గౌరవంగా జీవించడానికే వారు ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అవసరమైన సమయంలో అప్పుగా సరుకులు అందించడం నుంచి శుభకార్యాల్లో అండగా నిలవడం వరకు ఆర్యవైశ్యులు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు.

**'నన్ను ముందుగా గుర్తించింది రోశయ్యే'**

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. శాసనమండలిలో తాను దూకుడుగా మాట్లాడుతున్న సమయంలో రోశయ్య తనను పిలిచి ఆవేశాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు సాగాలని సూచించారని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానంలో రోశయ్య ఇచ్చిన ప్రోత్సాహం, ఆశీర్వాదాలను ఎప్పటికీ మరచిపోలేనన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో రాష్ట్రం ఏర్పడటంలో రోశయ్య పాత్ర కీలకమని సీఎం పేర్కొన్నారు. రోశయ్యకు రాజకీయంగా అవకాశం, గౌరవం కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. హైదరాబాద్‌తో తన అనుబంధాన్ని రోశయ్య స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన గౌరవాన్ని కాపాడే ఉద్దేశంతో నగర నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**'ప్రపంచానికి గాంధీ.. దేశానికి గర్వకారణం'**

ఆర్యవైశ్య సమాజం నుంచి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన మహాత్మాగాంధీ భారతదేశానికి గర్వకారణమని సీఎం అన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా గాంధీ గొప్పతనం తెలియని వారు ఉండరని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉండటం గర్వకారణమన్నారు.అలాగే పొట్టి శ్రీరాములు రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన త్యాగాన్ని సీఎం గుర్తుచేశారు. దేశ సమగ్రత కోసం మహాత్మాగాంధీ, రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సమాజానికి రావాల్సిన స్థాయిలో గుర్తింపు ఇంకా దక్కలేదని అన్నారు.

**'మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా'**


ఆర్యవైశ్యుల పట్ల తమ ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు ఆత్మగౌరవ భవన్ పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చూడాలని సూచించారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు."నేను మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తా"అని సీఎం స్పష్టం చేశారు.

**'రాజకీయాల్లో మీ వాటా మీరు తీసుకోండి'**

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటే సామాజికంగా, రాజకీయంగా మరింత బలపడతారని సీఎం అన్నారు. రాజకీయాల్లో తమకు రావాల్సిన వాటాను ఆర్యవైశ్యులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ పదవి ఇచ్చిందని, కొడంగల్‌లోని ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చైర్మన్ పదవి కల్పించినట్లు తెలిపారు.ఆర్యవైశ్యులకు ముందుచూపు, జాగ్రత్త సహజ లక్షణాలని, ఆ లక్షణాలతో సమాజాభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బండారి లక్ష్మారెడ్డి, ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ మధు యాష్కీతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, అధికారులు, ఉద్యోగులు, వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కృష్ణ యాదవ్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**
రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అధికారులు ఉద్యోగులు,కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ ఏకదంతున్ని ప్రార్థించిన ఎం బి కృష్ణ యాదవ్ టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు..



# ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 13:**
వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆలేరు ఎస్హెచ్ఓ ఉదయ్ కిరణ్ తెలిపారు. పట్టణ కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆలేరు వినాయక నిర్వాహకులు తప్పనిసరి పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలనీ, ఏదైనా అత్యవసర పరిస్థితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ అధికారుల సమక్షంలోనే మండపాలకు కరెంటు కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా డీజేలు, ప్యాడ్ బ్యాండ్లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. వాటిని ఏర్పాటు చేసుకోవాలనుకునే నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. చివరిగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి నుండి మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు షురూ...

- ప్రతిరోజూ ఉదయం–సాయంత్రం ప్రత్యేక పూజలు...
- భక్తులతో కళకళలాడనున్న ఆలయ ప్రాంగణం
- 23న ఘనంగా గణేష్ నిమజ్జనం...
- ప్రత్యేక హోమంలో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 13:**

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆరాధనతో కరీంనగర్ నగరం భక్తి పారవశ్యంలో మునిగిపోనుంది. గణనాథుడి నామస్మరణలు, మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, హోమాల మధ్య కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయం గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులతో గత 16 ఏళ్లుగా ఈ ఆలయంలో శ్రీ మహాశక్తి ఆలయంలో అత్యంత వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భావించే గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుండి (సోమవారం) ఈ నెల 22వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో మారుమోగే మంత్రోచ్చారణలు, సాయంత్రం జరిగే ప్రత్యేక పూజలతో భక్తిమయ వాతావరణం నెలకొననుంది.

**తొమ్మిది రోజుల పాటు సహస్ర మోదక గణపతి హోమం**

గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఈసారి ప్రత్యేకంగా 9 రోజుల పాటు సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించనున్నారు. వినాయకుడికి అత్యంత ప్రీతికరమైన మోదకాలను సమర్పిస్తూ జరిగే ఈ హోమం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది. కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని కోరుతూ భక్తులు ఈ ప్రత్యేక హోమంలో పాల్గొననున్నారు.ప్రతిరోజు ఉదయం 9 గంటలకు గణపతి పూజ, హోమం, సాయంత్రం 6.30 గంటలకు గణపతి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం జరిగే పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందే అవకాశం ఉంది. తొమ్మిది రోజుల పాటు ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడనున్నాయి.

**16 ఏళ్ల సంప్రదాయం... భక్తితో కొనసాగుతున్న వేడుకలు**

శ్రీ మహాశక్తి ఆలయంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. గత 16 ఏళ్లుగా ఏటా ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గణేశ్ ఉత్సవాల కోసం ఎదురుచూసే భక్తులకు ఈ వేడుకలు ఒక ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు, మహిళల నుంచి యువత వరకు అన్ని వర్గాల ప్రజలు గణనాథుడి పూజల్లో పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. ఒకవైపు భక్తి, మరోవైపు సంప్రదాయం... ఇంకోవైపు సామూహిక ఆధ్యాత్మిక వాతావరణం కలిసి శ్రీ మహాశక్తి ఆలయంలో గణేశ్ నవరాత్రులను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

**23న గణేష్ నిమజ్జనం**

తొమ్మిది రోజుల భక్తి సంబరాల అనంతరం ఈ నెల 23న గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. నవరాత్రుల చివరి రోజు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు సహస్రమోదక గణపతి హోమం, పూర్ణాహుతి, ఉత్తర పూజ కార్యక్రమాల అనంతరం నిమజ్జనం చేయనున్నారు మధ్యాహ్నం నిర్వహించే ప్రత్యేక హోమ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విఘ్నాలను తొలగించి, భక్తుల జీవితాల్లో సుఖసంతోషాలను నింపే వినాయకుడి ఆశీస్సుల కోసం కరీంనగర్ ప్రజలు శ్రీ మహాశక్తి ఆలయం వైపు బారులు తీరనున్నారు. "గణపతి బప్పా మోరియా" నినాదాల మధ్య, మంత్రోచ్చారణల నడుమ తొమ్మిది రోజుల పాటు కరీంనగర్‌లో భక్తి పరిమళాలు వెదజల్లనున్నాయి. శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే గణేశ్ నవరాత్రుల ఉత్సవాలకు హిందూ బంధువులందరూ పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com